# భారత్ శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 240 | హైదరాబాద్ | మంగళవారం 17-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00





ఆస్కార్-2026 అవార్డు విజేతల పూర్తి జాబితా



## హైదరాబాద్‌లో వర్షం

### ఒక్కసారిగా మారిపోయిన వాతావరణం

11లో

- ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం
- మాదాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్ సహా పలు ప్రాంతాల్లో వర్షం
- నగరంలో పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్

## సభకు ప్రిపేరై రండి.. మంత్రులకు, ఎమ్మెల్యేలకు


# సీఎం రేవంత్ క్లాస్

11లో

- చిట్‌చాట్‌లు మానేయండి..
- ఇష్యూపై కౌంటర్ ఇవ్వండి..
- అందరూ సభకు రావాల్సిందే..
- పార్టీ లైన్‌లోనే స్పందించాలి..
- సీఎల్పీ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి



## మోదీ పర్యటనకు, ఇరాన్‌పై దాడికి సంబంధం లేదు



- మోదీ ఇజ్రాయెల్ పర్యటన ముగిసిన రెండ్రోజుల తర్వాత ఇరాన్‌పై దాడి
- ఈ దాడులకు భారత్ మద్దతిస్తున్నట్టుగా విపక్షాల విమర్శలు
- మోదీ పర్యటనకు ముందు నుంచే పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయన్న రువెన్

11లో

## పశ్చిమ ఆసియా టెన్షన్

### వేలాది విమానాలు రద్దు.. లోక్‌సభలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

- ఇరాన్ తో ఇజ్రాయెల్అమెరికా వార్
- 4,335 భారత విమానాలు, 1,187 విదేశీ విమానాలు రద్దు
- ప్రయాణికుల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అన్న కేంద్ర మంత్రి
- సంక్షోభ సమయంలోనూ 2.19 లక్షల మంది ప్రయాణించారని వెల్లడి
- గగనతలం తెరుచుకున్నాకే సేవలు సాధారణ స్థితికి వస్తాయని స్పష్టీకరణ

11లో






## నటి ప్రత్యూష

# మృతి కేసు..

### అమెరికా నుంచి వచ్చి కోర్టులో లొంగిపోయిన సిద్ధార్థ రెడ్డి

- 2002లో నటి ప్రత్యూష, ఆమె స్నేహితుడు సిద్ధార్థ రెడ్డి పురుగుల మందు తాగిన వైనం
- ఈ కేసులో 24 ఏళ్ల తర్వాత కీలక పరిణామం
- సుప్రీం కోర్టు ఆదేశాలతో నాంపల్లి కోర్టులో లొంగిపోయిన సిద్ధార్థ రెడ్డి
- ఈ కేసులో సిద్ధార్థ రెడ్డికి ఐదేళ్ల జైలు శిక్ష ఖరారు చేసిన ట్రయల్ కోర్టు

## భారత్‌కు భారీ ఊరట..

### క్షేమంగా ముంద్రా పోర్టుకు చేరుకున్న ఎల్పీజీ ట్యాంకర్ 'శివాలిక్'

- హోర్ముజ్ అడ్డంకిని అధిగమించి భారత్ చేరుకున్న ఎల్పీజీ ట్యాంకర్
- ఖతార్ నుంచి బయలుదేరిన శివాలిక్ ఎల్పీజీ ట్యాంకర్ గుజరాత్‌కు చేరిక
- 45,000 టన్నుల గ్యాస్‌తో సురక్షితంగా వచ్చిన నౌక
- రేపు కాండ్లా పోర్టుకు రానున్న మరో నౌక 'నందా దేవి'
- పర్షియన్ గల్ఫ్‌లో భారత నావికులందరూ సురక్షితమన్న కేంద్రం




## ముస్లింల అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం

# ఇఫ్తార్ విందులో సీఎం చంద్రబాబు



- విజయవాడలో ప్రభుత్వ ఇఫ్తార్ విందులో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- ముస్లింల ఆర్థిక, రాజకీయ అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ

11లో

## యువగళంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

### 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఆవిష్కరణలో మంత్రి లోకేశ్




- అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహావిష్కరణ
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి పాల్గొన్న లోకేశ్
- ఆరు నెలల రికార్డు సమయంలో పూర్తిచేసిన 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్'
- పొట్టి శ్రీరాములు త్యాగం భావితరాలకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య
- ఒక మనిషి త్యాగం ఒక జాతికి గౌరవంగా నిలిచిందని వెల్లడి

# 5 రాష్ట్రాల్లో గెలుపు ఎవరిది

దేశంలో ఎన్నికల సందడి మొదలైంది. కీలకమైన నాలుగు రాష్ట్రాలు మరియు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ ఐదు ప్రాంతాల్లో కలిపి మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చేసింది. ఈ ఐదురాష్ట్రాల ఎన్నికల్లో అస్సాంలో మాత్రమే కాంగ్రెస్, బీజేపీ ముఖాముఖి పోటీ పడుతున్నాయి. బెంగాల్ లో బీజేపీ టీఎంసీ, కేరళలో కాంగ్రెస్ , లెఫ్ట్ కూటములు.. తమిళనాడులో త్రిముఖ పోటీ ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం , పుదుచ్చేరిలలో రాజకీయ సందడి పతాక స్థాయికి చేరింది. ఈ ఎన్నికలు కేవలం స్థానిక ప్రభుత్వాల మార్పుకే పరిమితం కాకుండా, కేంద్ర రాజకీయాల్లోనూ మార్పులు తీసుకురానున్నాయి. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం ఉన్న రాష్ట్రాల్లో జాతీయ పార్టీలు ఏ మేరకు పాగా వేస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పశ్చిమ బెంగాల్ పోరు మళ్ళీ దీదీ వర్సెస్ మోదీ గా మారింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ తన పదేళ్ల సంక్షేమ పథకాలు ,బెంగాలీ అస్మితను నమ్ముకోగా, బీజేపీ అవినీతి , ప్రజల అసంతృప్తిని ప్రధాన అస్త్రాలుగా చేసుకుని బరిలోకి దిగుతోంది. గత ఎన్నికల కంటే ఈసారి బీజేపీ మరింత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండటంతో, బెంగాల్ గడ్డపై హోరాహోరీ పోరు తప్పేలా లేదు. ఇక్కడ చిన్నపాటి ఓట్ల చీలిక కూడా ఫలితాలను తలకిందులు చేసే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. అధికార డీఎంకే కూటమి పటిష్టంగా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, సూపర్ స్టార్ విజయ్ రాజకీయ ప్రవేశం తమిళగ వెట్రి కజగం రూపంలో కొత్త సవాలును విసిరింది. అన్నాడీఎంకే తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ఉండగా, విజయ్ రాకతో ఇక్కడ ముక్కోణపు పోటీ నెలకొంది. విజయ్ వైపు మళ్లుతున్న యువత ఓట్లు ఎవరి గెలుపును అడ్డుకుంటాయో అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. పుదుచ్చేరిలో కూడా ఇదే విధమైన కూటముల పోరు సాగుతోంది. డీఎంకే కూటమిలో కాంగ్రెస్, అన్నాడీఎంకే కూటమిలో బీజేపీ ఉన్నాయి. సాధారణంగా కేరళలో ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారుతుంటుంది, కానీ గత ఎన్నికల్లో పినరయి విజయన్ ఆ సంప్రదాయాన్ని చెరిపివేశారు. ఎల్.డి.ఎఫ్ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించాలని చూస్తోంది. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ఈసారి ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని పట్టుదలతో ఉంది. బిజెపి ఇక్కడ బలమైన మూడో శక్తిగా ఎదగడానికి ప్రయత్నిస్తోంది. త్రిముఖ పోటీ జరిగే కొన్ని నియోజకవర్గాల్లో బిజెపి ఓట్లు ఎవరిని ముంచుతాయో అన్నది కీలకం. అస్సాంలో ప్రధాన పోటీ బిజెపి , కాంగ్రెస్ మధ్యే ఉంది. ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ సారథ్యంలో బిజెపి ధీమాగా ఉంది. మహాజోత్ కూటమి విచ్ఛిన్నం కావడం బిజెపికి కలిసి వచ్చే అంశం. కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ గొగోయ్ తన వ్యక్తిగత చరిష్మాతో బిజెపికి గట్టి పోటీ ఇస్తున్నారు. అయితే, అభివృద్ధి మంత్రం , హిందుత్వ కార్డుతో బిజెపి పైచేయి సాధించే అవకాశాలు ఉన్నాయని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ స్థానిక సమస్యలతో పాటు జాతీయ అంశాలు కూడా ఓటర్లపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు అటు అధికార పక్షానికి, ఇటు విపక్ష కూటమికి అత్యంత ప్రతిష్టాత్మకం కానున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల తీర్పు భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడులలో ప్రాంతీయ పార్టీల పట్టు నిలుస్తుందా? లేదా జాతీయ పార్టీలు తమ ప్రభావం చూపిస్తాయా? అన్నది మే నెలలో తేలనుంది. తమిళనాడు, బెంగాల్, కేరళ, అస్సాం , పుదుచ్చేరి శాసనసభల పదవీకాలం మే, జూన్ నెలల్లో ముగియనుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఈసీ ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేసింది. క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఆరు రాష్ట్రాల్లోని ఎనిమిది స్థానాలకు ఉప ఎన్నికలు కూడా జరగనున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేల మరణంతో అనివార్యమైన ఈ ఉప ఎన్నికల వివరాలు:పశ్చిమ బెంగాల్‌లో వరుసగా అధికారంలో ఉన్న మమతా బెనర్జీకి ఈసారి వ్యతిరేక పవనాలు బలంగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. బీజేపీ బలమైన ప్రతిపక్షంగా అవతరించడం, క్షేత్రస్థాయిలో సంస్థాగత మార్పులు మమతా బెనర్జీకి పెద్ద సవాలుగా మారాయి. అవినీతి ఆరోపణలు, నిరుద్యోగ సమస్యలు మరియు శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వంపై వస్తున్న విమర్శలు దీదీకి మైనస్ పాయింట్లుగా మారుతున్నాయి. ప్రజలు మార్పును కోరుకుంటున్నారా? లేక సంక్షేమ పథకాలతో మమత మరోసారి అధికారాన్ని నిలబెట్టుకుంటారా? అన్నది వేచి చూడాలి. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వంపై ప్రజల స్పందన మిశ్రమంగా కనిపిస్తోంది. ధరల పెరుగుదల, మౌలిక సదుపాయాల కొరత, మరియు కొన్ని ప్రజా వ్యతిరేక విధానాలు స్టాలిన్ సర్కార్‌కు ఇబ్బందిగా మారాయి. తమిళనాడు రాజకీయాల్లో వస్తున్న కొత్త మార్పులు, మిత్రపక్షాల ఒత్తిడి మరియు బీజేపీ వంటి జాతీయ పార్టీల విస్తరణ స్టాలిన్ ఓటు బ్యాంకుకు ఎంతవరకు గండి కొడుతుందనేది కీలకం. సంక్షేమ కార్యక్రమాలపై పెడుతున్న భారీ వ్యయం మరియు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అధికార పక్షాన్ని ఆత్మరక్షణలో పడేశాయి.

# జనసేన వర్సెస్ టీడీపీ

కాకినాడ, మార్చి 16,

పిఠాపురం నియోజకవర్గ శాశ్వత ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్ ఉంటారని, ఆయన చేస్తున్న అభివృద్ధే అందుకు నిదర్శనమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పిఠాపురంలో ఇప్పటికే 60,000 మందితో జనసేన ఒక బలమైన కుటుంబంగా మారిందని, త్వరలోనే లక్ష సభ్యత్వాల మార్కును చేరుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ కేవలం రాష్ట్ర స్థాయి నేత మాత్రమే కాదు, దేశ స్థాయి నాయకుడిగా ఎదిగారని కొనియాడారు. డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి బాబు కూడా పవన్ కళ్యాణ్ సేవలను కొనియాడుతూ, ఎంపీ వ్యాఖ్యలకు మద్దతు తెలిపారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఠాపురంలో పార్టీ శ్రేణులు పండుగ వాతావరణాన్ని తలపించేలా వేడుకలు నిర్వహించాయి. ఉప్పాడ బస్టాండ్ వద్ద భారీ కేక్ కట్ చేసిన అనంతరం, పిఠాపురం నుండి గొల్లప్రోలు వరకు జనసైనికులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గొల్లప్రోలులో అట్టహాసంగా జెండా ఆవిష్కరణ జరిగింది. రాజకీయ వేడుకలతో పాటు సేవా నిరతిని చాటుకుంటూ, పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు ఓదూరి కిషోర్ సహా భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. అయితే, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వ్యాఖ్యల వెనుక పిఠాపురం నియోజకవర్గంలో సాగుతున్న అంతర్గత రాజకీయ పోరు కారణమనే చర్చ నడుస్తోంది. ఇటీవల ఒక ప్రభుత్వ కార్యక్రమంలో ఫ్లెక్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో చిన్నదిగా ఉండటంపై టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ అధికారులపై, జనసేన నేతలపై మండిపడ్డారు. ముఖ్యమంత్రికి ప్రాధాన్యత లేని చోట టీడీపీ కార్యకర్తలకు స్థానం ఎక్కడిదని ఆయన ప్రశ్నిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కూటమి నాయకులు రాష్ట్ర స్థాయిలో కలిసి ఉన్నప్పటికీ, పిఠాపురంలో మాత్రం టీడీపీ, జనసేన నేతల మధ్య ‘కోల్డ్ వార్’ నడుస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. వర్మ అసహనానికి కౌంటర్ గానే ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ “శాశ్వత ఎమ్మెల్యే” వ్యాఖ్యలు చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పిఠాపురంలో శుక్రవారం జరిగిన ‘స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర’ కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం చెలరేగింది. మున్సిపల్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో చాలా చిన్నదిగా ఉండటంపై మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్రంగా మండిపడ్డారు. అధికారులే కూటమి పార్టీల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. ఇది కేవలం తనను మాత్రమే కాకుండా, మూడు పార్టీల నాయకులను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. పిలిచి అవమానించడం తగదని సూచిస్తూ, అధికారుల తీరుకు నిరసనగా ఆయన సమావేశం మధ్యలోనే వెళ్ళిపోయారు. వర్మకు మద్దతుగా టీడీపీ కార్యకర్తలు కూడా అధికారుల వ్యవహారశైలిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పిఠాపురంలో వర్మ బలమైన నాయకుడు. గతంలో ఓసారి పార్టీ టికెట్ రాకపోతే ఆయన ఇండిపెండెంట్గా పోటీ చేసి గెలిచారు. పిఠాపురం నియోజకవర్గాన్ని బలమైన నియోజకవర్గంగా మార్చారు వర్మ. అయితే రాష్ట్ర స్థాయిలో పవన్ కళ్యాణ్ తో టిడిపికి పొత్తు అవసరం. గత అనుభవాల దృష్ట్యా పవన్ కళ్యాణ్ కు ఒక నియోజకవర్గం అవసరం వచ్చింది. అంతకుముందు ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోవడంతో 2024లో జాగ్రత్త పడ్డారు. అలా పిఠాపురం పై దృష్టి పడడంతో వర్మను సైడ్ చేయాల్సి వచ్చింది. బలమైన నాయకుడు కావడంతో ఆయన సాయం తీసుకోవాలని భావించి ప్రాధాన్యమిచ్చారు వర్మకు.. అయితే బలమైన హామీతోనే అప్పట్లో వర్మ పోటీ నుంచి తప్పుకున్నట్లు ప్రచారం ఉంది. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీంతో రోజురోజుకు వర్మలో అసహనం పెరుగుతోంది. టిడిపి నాయకత్వం సైతం వర్మ విషయంలో నిస్సహాయతతో ఉంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పిఠాపురం నియోజకవర్గం లో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. వర్మ కు ఎటువంటి నామినేటెడ్ పదవి దక్కలేదు. ఆపై పిఠాపురం నియోజకవర్గంలో అధికార పార్టీగా సరైన గౌరవం దక్కడం లేదు. ఈ తరుణంలో పిఠాపురంలో జనసేన వర్సెస్ టిడిపి అన్నట్టు పరిస్థితి మారింది. రాష్ట్రస్థాయిలో పొత్తు ఉండడం.. పవన్ కీలకంగా ఉండడం.. ఆయనకు కాదని వర్మకు పదవి ఇచ్చే అవకాశం లేకపోవడంతో రోజురోజుకు పరిస్థితి శృతిమించుతోంది. అయితే పిఠాపురంలో తనకే కాదు చంద్రబాబుకు కూడా విలువ లేదని చెప్పేందుకే వర్మ అలా చేసి ఉంటారన్న టాక్ కూడా పొలిటికల్ వర్గాల్లో ఉంది. ఇప్పటికే పిఠాపురం అనేసరికి రకరకాల వివాదం నడుస్తూనే ఉంటుంది. ఒకానొక దశలో వర్మ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోతారని కూడా ప్రచారం నడిచింది. పార్టీ కోసం కష్టపడిన తాను ఎందుకు గుడ్ బై చెబుతానని వర్మ ప్రశ్నించారు కూడా. అయితే తన ఆవేదనంత పార్టీ కోసమే అన్నట్టు ఇప్పుడు వర్మ ప్రవర్తన ఉంది. దీనిపై టిడిపి నాయకత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

# జగన్ సొంత రాజకీయాలు...

విజయవాడ, మార్చి 16,



వైసీపీ అధినేత జగన్ కోటరీని పక్కన పెట్టాలని ఆ పార్టీలో .. పై స్థాయి నేతల నుంచి కింది స్థాయి క్యాడర్ వరకూ కోరుకుంటున్నారు. జగన్ నేరుగా అందరితో టచ్ లో ఉండకపోవచ్చు కానీ అసలు మొత్తం ఆయన తరపున కోటరీలోకీలక వ్యక్తులుగా చెలామణి అవుతున్న నేతలే చక్కబెడుతున్నారు. జగన్ కు తెలుస్తుందో లేదో కూడా క్యాడర్ కు తెలియడం లేదు. అయితే రెండు రోజుల కిందట జరిగిన ఆవిర్భావ దినోత్సవం రోజున కొద్ది సేపే అయినా స్క్రిప్ట్ లేకుండా ప్రసంగించడం, ఆ కార్యక్రమంలో ఆయన పక్కన కోటరీ నేతలెవరూ లేకపోవడం పార్టీ క్యాడర్ లో ఆశలు నింపుతోంది. వైసీపీ ఆవిర్భావ దినోత్సవం వేదికగా జగన్ తీరులో కనిపిస్తున్న మార్పు ఇప్పుడు ఆ పార్టీలో హాట్ టాపిక్ అయ్యింది. సాధారణంగా జగన్ అంటేనే చుట్టూ ఒక ప్రత్యేక కోటరీ ఉంటుంది. ఆ కోటరీని దాటుకుని సామాన్య కార్యకర్త వెళ్లడం అసాధ్యమనే ముద్ర పడిపోయింది. గత ఐదేళ్లుగా జగన్ తీసుకున్న అనేక నిర్ణయాల్లో ఆ ముగ్గురు నలుగురు కీలక నేతల పాత్రే ఎక్కువగా ఉందనే అసహనం పార్టీలో ఉంది. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులు జగన్ దృష్టికి వెళ్లకుండా ఈ కోటరీ అడ్డుపడుతోందని సీనియర్ నేతలు సైతం లోలోపల మదనపడుతున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఈ అసంతృప్తి మరింత పెరిగింది. కోటరీకి ఉన్న అతి సాన్నిహిత్యం వల్ల పార్టీ నేతల మధ్య దూరం పెరిగిందని క్యాడర్ గట్టిగా నమ్ముతోంది. ఇప్పుడు జగన్ ఈ వర్గాన్ని పక్కన పెడుతున్నట్లు కనిపిస్తుండటం కార్యకర్తలకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. సాధారణంగా జగన్ ప్రసంగాలు పక్కాగా రాసి పెట్టుకున్న కాగితాల చుట్టూ సాగుతుంటాయి. కానీ ఆవిర్భావ దినోత్సవం నాడు ఆయన ఏ కాగితం చూడకుండా మనసులో ఉన్నది మాట్లాడారు. ఇది నాయకత్వ శైలిలో మార్పును సూచిస్తోంది. నేరుగా ప్రజలతో కార్యకర్తలతో కనెక్ట్ అవ్వాలంటే మధ్యలో సలహాదారులు ఉండకూడదని జగన్ గుర్తించినట్లు కనిపిస్తోంది. కోటరీ చెప్పే లెక్కల కంటే కార్యకర్తల ఆవేదన వింటేనే పార్టీకి పూర్వవైభవం వస్తుందని ఆయన భావిస్తున్నట్లు ఈ ప్రసంగం ద్వారా అర్థమవుతోంది. కేవలం ఒక రోజు వేడుకతోనే ఈ మార్పు ఆగిపోతే ఫలితం ఉండదని విశ్లేషకులు చెబుతున్నారు. సలహాదారులు ఇచ్చే సమాచారంపైనే ఆధారపడకుండా జిల్లాల వారీగా ముఖ్య నేతలు కింది స్థాయి కార్యకర్తలతో జగన్ నేరుగా టచ్ లో ఉండాలి. లోటస్ పాండ్ లో లేదా తాడేపల్లిలో గదుల మధ్య జరిగే సమీక్షల కంటే క్షేత్రస్థాయి పర్యటనలు పెంచాలని క్యాడర్ ఆశిస్తోంది. ఇప్పటికైనా కళ్లు తెరిచారని కోటరీని దూరంగా పెట్టి సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టారని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నాయకుడి చుట్టూ ఉండే వ్యక్తుల కంటే జెండా మోసే కార్యకర్తలే శ్రీరామరక్ష అని జగన్ కి ఆలస్యంగానైనా అర్థమైందన్న భావన వ్యక్తమవుతోంది. జగన్ తనంతట తానుగా బయటకు వచ్చి ప్రజలతో మమేకమైతే అటు ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలోనూ ఇటు పార్టీని బలోపేతం చేయడంలోనూ వేగం పెరుగుతుందని అనుకోవచ్చు. మరి ఇదే పద్ధతిని ఆయన భవిష్యత్తులో కూడా కొనసాగిస్తారా లేక మళ్లీ పాత సలహాదారుల మాయలో పడతారా అన్నది వేచి చూడాలి.

# ఏపీ బీజేపీకి ఏమైంది...

విజయవాడ, మార్చి 16

జాతీయస్థాయిలో భారతీయ జనతా పార్టీ దూకుడుగా ఉంది. చాలా దూకుడుగా ముందుకు వెళ్తోంది. కానీ ఏపీలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది పరిస్థితి. పివిఎన్ మాధవ్ పగ్గాలు తీసుకున్నాక పరిస్థితుల్లో మార్పు ఉంటుందని అంతా భావించారు. ఆయన కూడా బాధ్యతలు తీసుకున్నాక చాలా వేగంగా పావులు కదిపారు. కానీ ఎందుకో ఇటీవల ఫుల్ సైలెన్స్ అయ్యారు. పార్టీ కార్యక్రమాలు కూడా తగ్గాయి. ముఖ్యంగా పార్టీలో కార్యవర్గ విభాగాల ఏర్పాటు కూడా జరగలేదు. పక్కనే ఉన్న తెలంగాణలో కొత్త కార్యవర్గాలను ప్రకటించారు. కొత్త కొత్త నేతలకు ఛాన్స్ ఇచ్చారు. కానీ ఏపీలో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఏమో కూటమిలో ఉన్నామంటే ఉన్నాం అన్నట్టు ఉంది వారి పరిస్థితి. మొన్నటి ఎన్నికల్లో ఓట్లతో పాటు సీట్లను పెంచుకుంది భారతీయ జనతా పార్టీ. ఆ పార్టీ తరపున ఎనిమిది మంది ఎమ్మెల్యేలు గెలిచారు. ముగ్గురు లోక్సభ సభ్యులు అయ్యారు. కేంద్రమంత్రిగా భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ఉన్నారు. రాష్ట్ర మంత్రిగా సత్య కుమార్ యాదవ్ ఉన్నారు. మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఎమ్మెల్సీ అయ్యారు. ఎంపీలుగా పురందేశ్వరి, సీఎం రమేష్.. ఎమ్మెల్యేలుగా విష్ణుకుమార్ రాజు, సుజనా చౌదరి వంటి సీనియర్లు కొనసాగుతున్నారు. అయినా సరే పార్టీకి ఒక ఊపు తేలేకపోతున్నారు. దీనికి ఏం కారణం అనేది ఇప్పుడు ఒక ప్రశ్న. పొత్తుతో ముందుకు వెళ్తున్నారు సరే. కానీ పార్టీ కార్యక్రమాల విషయంలో సైతం వెనుకబాటు కనిపిస్తోంది. ఇది పార్టీ శ్రేణులకు అంతుపట్టడం లేదు. పార్టీ బలోపేతం అనేది భవిష్యత్తు కలగానే మిగిలిపోతోంది. భారతీయ జనతా పార్టీ ఇప్పటిది కాదు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించే సమయానికి ఏపీలో ఎంటర్ అయింది ఆ పార్టీ. ఉమ్మడి ఏపీలో విశాఖ మహానగరంలో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్ పదవిని సొంతం చేసుకుంది బిజెపి. అటు తర్వాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. అంతకంటే ముందే విజయాన్ని దక్కించుకున్న బీజేపీ మాత్రం వెనుకబడిపోయింది. తెలుగుదేశం పార్టీతో పొత్తు ఉంటే పదుల సంఖ్యలో సీట్లు దక్కించుకుంటోంది. లేకుంటే ఉనికి చాటుకోవడానికి కూడా ఇబ్బంది పడుతోంది. ఈ పరిస్థితి దశాబ్దాలుగా మారడం లేదు. నాయకత్వాలు మారినా సరైన ఫలితం దక్కడం లేదు బిజెపికి. యావత్తు భారతదేశాన్ని ఆవహిస్తున్న బిజెపి.. ఏపీలో ఎందుకు వెనుకబడిపోతుంది అనేది ఇప్పటికీ ధర్మసందేహమే.

## నా భర్త నాకు కావాలి.... భర్త కోసం భార్య పోరాటం.

తాడేపల్లికుంచనపల్లిలోని భర్త నివాసం ముందు కుటుంబ సభ్యులతో కలసి భార్య నిరసన కు దిగింది. కాపురానికి తీసుకువెళ్లాలని భర్త ఇంటి ముందు ధర్నా చేసింది. కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన చైతన్య అనే యువతితో గుంటూరు జిల్లా మందడంకు చెందిన యర్రంనేనీ విజయ్ తో 2017లో వివాహం జరిగింది. ప్రెగ్నెన్సీ రావడంతో తనకు ఇష్టం లేని పెళ్లి చేశారంటూ... పెళ్లి అయిన 8 నెలలకే భార్య చైతన్యను భర్త విజయ్ వదిలేసాడు. భర్త కోసం 8 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న తనకు అత్తమామలు న్యాయం చేయడం లేదని భార్య ఆవేదన చెందుతోంది. తమకు పుట్టిన బిడ్డకు న్యాయం చేయాలని భర్త ఇంటి ముందు ధర్నాకు దిగింది. భార్యను కాపురానికి తీసుకువెళ్లాలని న్యాయస్థానం నుంచి ఆర్డర్ వచ్చిన కోర్టు ఆర్డర్ ను భర్త, అత్తమామలు పట్టించు కోవడంలేదని అంటోంది. వేరే మహిళతో సహజీవనం చేస్తూ తనని , బిడ్డని పట్టించుకోవడం లేదని ఆరోపించింది.

# కొబ్బరికి యుద్ధ కష్టాలు

కాకినాడ, మార్చి 16, (

కొబ్బరి అనగానే కేరళ తరువాత కోనసీమ గుర్తుకు వస్తుంది. కోనసీమ వ్యాప్తంగా కొబ్బరి ఎగుమతులకు పెట్టింది పేరు. ఇక్కడి నుంచి ప్రతీ రోజూ టన్నుల కొద్దీ కొబ్బరి స్వదేశీ మార్కెట్‌కే కాక ఇతర దేశాలకు ఎగుమతులు అవుతుంటాయి. అయితే మిడిల్ ఈస్ట్‌లో జరుగుతోన్న ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ప్రభావం ఈ కొబ్బరి మార్కెట్ పైన కూడా పడిందంటున్నారు కొబ్బరి వ్యాపారులు. ఈ పరిస్థితి ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లాతోపాటు తమిళనాడు, కేరళ మార్కెట్లపై తీవ్ర ప్రభావం ఉంటుందంటున్నారు. కొబ్బరి సాగుకు దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తమిళనాడు, కేరళ, కర్ణాటక పెట్టింది పేరు. గతంలో దేశీయ మార్కెట్‌లోనే కొబ్బరి ఎగుమతులు ఉండగా కొన్నేళ్లుగా మన దేశీయ కొబ్బరికి మిడిల్ ఈస్ట్ దేశాల్లో బాగా డిమాండ్ పెరిగింది. ముఖ్యమంగా ఏపీ, తమిళనాడు ప్రాంతాల నుంచి గల్ఫ్ దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయంటున్నారు. రంజాన్ మాసం కావడంతో కొబ్బరికి డిమాండ్ ఏర్పడింది. సాంప్రదాయ వంటకాల్లో కొబ్బరిని ఎక్కువగా వాడుతున్నారని, దీంతోపాటు ఆదేశ సౌందర్య, ఇతరాత్ర తయారీ సామాగ్రిలో కొబ్బరి వినియోగం బాగా పెరిగిందంటున్నారు. కువైట్, ఒమన్, దుబాయ్, ఇరాన్, సౌదీకి కొబ్బరి ఎగుమతులు జరుగుతుండగా ఆ దేశాలకు ఎగుమతులు చేసేందుకు అంతా సిద్ధం చేశారు. ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ దేశాల్లో యుద్ధ వాతావరణంతో గుబులు పుట్టిస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సేనలు విరుచకుపడుతున్నాయి. మరో పక్క దుబాయ్, కువైట్, సౌదీ అరేబియా, ఒమాన్, బెహ్రాయిన్ దేశాలపై ఇరాన్ డ్రోన్లతో దాడులు చేస్తుంది. ఈ పరిస్థితుల్లో ముంబయి, చెన్నై, తూత్తుకూడి పోర్టుల్లోనే కొబ్బరి కాయలతో కంటెయినర్లు నిలిచిపోయాయని అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌కు సంబంధించిన కొబ్బరి వ్యాపారులు, రైతులు చెబుతున్నారు. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో.. ఆయా దేశాలకు ఎగుమతులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందంటున్నారు. ఆయా ఓడరేవుల్లో ఉన్న సరకును స్థానికంగా తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, ధరల పతనంతో తీవ్రంగా నష్టపోతున్నామంటున్నారు. గత నెలలో శివరాత్రి సందర్భంగా కోనసీమ కొబ్బరి మార్కెట్లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయని, వెయ్యి పచ్చి కాయలు రూ.18-20 వేలు పలికాయని రైతులు వెల్లడించారు. కురిడీల ధరలూ బాగానే ఉండగా శ్రీరామనవమికి దేశవ్యాప్తంగా మంచి ధర వస్తుందని వ్యాపారులు ఆశించారు. ఓడరేవుల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్లే కొబ్బరికాయలు అక్కడే నిలిచిపోవడంతో ధరలపై ప్రభావం చూపిందంటున్నారు. దీంతో ప్రస్తుతం వెయ్యి కాయలు రూ.13-14 వేలకు పతనమయ్యాయని వ్యాపారులు రైతులు అంటున్నారు. ఏపీలో కొబ్బరికి ప్రసిద్ధి చెందిన కోనసీమ జిల్లా అంబాజీపేటలో కొబ్బరికి పెట్టింది పేరు. అలాంటి ప్రాంతం నుంచి రోజు ఇతర రాష్ట్రాలకు పదుల సంఖ్యలో లారీలు ఎగుమతి అయ్యేవి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎగుమతులు పూర్తిగా పడిపోయి కొబ్బరి పచ్చికాయ కురిడికాయ ధరలు అమాంతంగా పడిపోవడంతో అటు వ్యాపారులు ఇటు రైతులు ఆవేదన చెందుతున్నారు.

# ఉత్థానం ప్రజలకు భారీ ఊరట

శ్రీకాకుళం, మార్చి 16

చాలా ఏళ్లుగా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత ప్రజలకు ఒక గొప్ప శుభవార్త అందింది. పలాసలో ఉన్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్ , సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో తొలిసారిగా ఒక కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చాలా విజయవంతంగా జరిగింది. ఈ ఆపరేషన్ ద్వారా సోంపేటకు చెందిన ఒక యువతికి కొత్త జీవితం దొరికింది. ఒక మారుమూల ప్రాంతంలో మెడికల్ కాలేజీ కూడా లేని చోట ఇలాంటి పెద్ద ఆపరేషన్ జరగడం ఆ ప్రాంత ప్రజలకు భారీ ఊరటగానే చెప్పవచ్చు. సోంపేటకు చెందిన సీహెచ్ హేమ శ్రీ అనే యువతి గత కొంత కాలంగా రెండు కిడ్నీలు పాడైపోయి చాలా ఇబ్బందులు పడుతోంది. ఆమె పరిస్థితి చూసి చలించిపోయిన తండ్రి మోహన్ రావు తన కిడ్నీని ఇచ్చేందుకు ముందుకొచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మొదలైన ఆపరేషన్ సుమారు మధ్యాహ్నం 3 గంటల వరకు అంటే నాలుగు నుంచి ఐదు గంటల పాటు సాగింది.. డాక్టర్లు చాలా కష్టపడి ఈ ఆపరేషన్ విజయవంతం చేశారు. ప్రస్తుతం హేమశ్రీ కిడ్నీ బాగానే పని చేస్తోందని, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. అయితే ఆపరేషన్ తర్వాత ఇచ్చే జాగ్రత్తల్లో భాగంగా మరో 15 రోజుల పాటు ఆమెకు వైద్యసేవలు అందిస్తామని డాక్టర్లు తెలిపారు. ఈ ఆపరేషన్ వెనుక ఒక పెద్ద డాక్టర్ల టీమ్ కృషి ఉంది. కేజీహెచ్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజు ఈ టీమ్‌కు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పలాస వంటి చిన్న ప్రాంతంలో ఇలాంటి ఆపరేషన్ చేయడం ఇదే మొదటిసారి అని గర్వంగా చెప్పారు. శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రికి చెందిన సీనియర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు కూడా ఈ టీమ్‌లో కీలక పాత్ర పోషించారు. వీరితోపాటు డాక్టర్లు పూర్ణచంద్ర, వివేకానంద, అశోక్‌వర్ధన్, జోగినాయుడు, స్థానిక వైద్యులు రాకేష్, జ్యోత్స్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ జే కిశోర్ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు అనేవి ఒక పెద్ద సమస్యగా ఉన్నాయి. గతంలో ఇలాంటి ఆపరేషన్లు కావాలంటే విశాఖ, కర్నూలు, గుంటూరు వెళ్లాల్సి వచ్చేది. పలాసలో ఈ కిడ్నీ రీసెర్చ్ సెంటర్ రావడం వల్ల స్థానిక ప్రజలకు ఎంతో ?లు జరుగుతోంది. మారుమూల ప్రాంతంలో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో ఇలాంటి సదుపాయాలు ఉండటం గొప్ప విషయమని డాక్టర్ ఉమామహేశ్వరరావు కొనియాడారు. ఈ ఆసుపత్రి నిర్మాణం అభివృద్ధిపై నాయకులు స్పందించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో ఆసుపత్రి నిర్మిస్తే నేడు కూటమి ప్రభుత్వంలో కిడ్నీ మార్పిడి చికిత్సకు చర్యలు చేపట్టినట్లు స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దాతల సహాయంతో పది కొత్త డయాలసిస్ యంత్రాలను ఏర్పాటు చేశామని వైద్య పరికరాల కోసం 9 కోట్లు రూపాయలు, పరిశోధనల కోసం 3 కోట్ల రూపాయలు కేటాయించినట్టు వెల్లడించారు.

# దివ్యాంగ విద్యార్థినికి రెండో అంతస్తులో పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు

### తల్లి సాయంతో అవస్థలు పడుతూ కేంద్రానికి చేరుకున్న రేణుక

### ఆమె సెంటరు కిందకు మార్చితే కాస్త ఉపశమనం కలిగే అవకాశం

..తాను దివ్యాంగురాలినని కుమిలిపోలేదు. ఇంటిపట్టునే ఉండి తల్లిదండ్రులకు భారం కావాలని అనుకోలేదు.పట్టుదలతో చదివి ప్రయోజకురాలిని కావాలని కంకణం కట్టుకుంది.ఎవరెన్ని సూటిపోటి మాటలు అన్నా తనని కాదనుకుంది.చదువుపై ఉన్న మక్కువతో పదో తరగతి పరీక్షలు రాసి తన సత్తా నిరూపించుకోవాలనుకుంది. ఆమెకు పరీక్ష రాసే హాలు రెండో అంతస్తులో కేటాయించడంతో అమ్మే ఆమెకు ఆసరా అయ్యింది.కూతురును రెండో అంతస్తుకు ఎత్తుకొని మెట్ల మార్గంలో తీసుకెళ్లడం.. దివ్యాంగ కూతురు పరీక్ష రాయడం ఇద్దరికీ ఒక పరీక్షే అయ్యింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కేశ్వాపురం గ్రామానికి చెందిన కొండూరి జానయ్య-శారద దంపతులకు కుమార్తె రేణుకతోపాటు ఇద్దరు కుమారులు. భార్యాభర్తలు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే చిన్నతనం నుంచే ఎదుగుదల లేని స్థితిలో ఉన్న రేణుకకు చదువంటే చాలా మక్కువ.ఆమె పట్టుదలతో చదివి పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమైంది.ఈ తరుణంలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కావడంతో నడవలేని తన కూతురును ఎత్తుకొని తల్లి కూసుమంచి మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చింది. ఆమెకు రెండో అంతస్తులో గది కేటాయించడంతో తన బిడ్డను చంటి పిల్లలా ఎత్తుకొని ఇబ్బందులు పడుతూ సీట్లో



కూర్చోబెట్టింది. పరీక్ష ముగిసిన తర్వాత తల్లి మళ్లీ కూతురు రేణుకను ఎత్తుకొని ఇంటికి తీసుకెళ్లింది. రేణుక పరీక్షరాసే కేంద్రాన్ని కిందకు మార్చినట్లైతే కొంత ఉపశమనం కలినట్లవుతుంది.రేణుకకు దివ్యాంగురాలి సర్టిఫికెట్ ఉన్నా, ఆమె పరీక్ష రాయడానికి సహాయకులను తీసుకునే అవకాశం ఉన్నా తానే స్వయంగా పరీక్ష రాస్తానని కేంద్రానికి వచ్చింది. కాగా, తన కూతురు బాగా చదువుకుంటుంది. మాకు చదివించాలనే ఉంది కానీ ఈ పరిస్థితుల్లో ఎత్తుకొని ఎంత దూరం తీసుకెళ్లగలం అంటూ తల్లి పరీక్ష కేంద్రం బయట తన ఆవేదన వ్యక్తం చేసింది.

# మందుగుండు సామాగ్రి పేలి గోపాలపట్నం పరిధిలో భారీ పేలుడు

### భయాందోళనలు పరుగులు తీసిన స్థానికులు

### భయం గుప్పెట్లో రజక వీధి ప్రజలు సంఘటన స్థలాన్ని పరిశీలించిన గోపాలపట్నం సిఐ, ఎస్ఐ

### మంటలర్పిన స్థానిక యువత

విశాఖపట్నం మార్చి 16,

గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన భారీ పేలుడు స్థానికుల్లో తీవ్ర భయాందోళన కలిగించింది. విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 89వ వార్డు ఆదర్శనగర్, ఎర్రచెరువు రజక కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది.

స్థానికుల సమాచారం ప్రకారం, రజక వీధిలో ఉన్న ఒక భవనంలో కొంతకాలంగా అనుమతి లేకుండా మందుగుండు సామగ్రి తయారీ జరుగుతున్నట్లు అనుమానాలు ఉన్నాయి. ఆదివారం అకస్మాత్తుగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పేలుడు శబ్దం దూర ప్రాంతాల వరకు వినిపించడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పేలుడు సంభవించిన వెంటనే ఆ భవనంలో మంటలు చెలరేగాయి. అయితే అక్కడున్న స్థానిక యువకులు ధైర్యంగా ముందుకు వచ్చి మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. వారి సహకారంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు.

సమాచారం అందుకున్న వెంటనే గోపాలపట్నం పోలీస్ స్టేషన్ సీఐ సన్యాసి నాయుడు, ఎస్సై రామారావు తమ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పోలీసులు పరిసర ప్రాంతాన్ని పూర్తిగా తనిఖీ చేస్తూ పేలుడు ఎలా జరిగింది, ఏ రకమైన మందుగుండు సామగ్రి అక్కడ తయారు చేస్తున్నారు అనే అంశాలపై దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో, ఆ భవనంలో అనధికారికంగా మందుగుండు సామగ్రి తయారీ జరుగుతున్న అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. భవన యజమాని వివరాలు సేకరిస్తూ, అక్కడ నిల్వ ఉంచిన పదార్థాలు ఏమిటి అనే విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారు. భవనంలో ఇంకా ప్రమాదకర పదార్థాలు ఉన్నాయా అనే దానిపై కూడా జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో ఆదర్శనగర్, ఎర్రచెరువు రజక కాలనీ ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికులు భయాందోళనలో ఉండగా పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి భద్రతా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు

# మూడు రాజధానులతో జగన్.. మూడు పార్టీలతో పవన్

నెల్లూరు, మార్చి 16,

ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు తర్వాత ఎవరు అంటే కచ్చితంగా జగన్, పవన్, లోకేష్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తాయి. ఎందుకంటే ఆ ముగ్గురు ఎవరికి వారే ముద్ర చూపుకున్నారు. అయితే ప్రధానంగా జగన్ తో పాటు పవన్ రాజకీయ పార్టీలు ప్రారంభించి తమ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. అయితే ఆ ఇద్దరు నేతలది విభిన్నం. ఇద్దరూ తలోదారి తో ముందుకు సాగుతున్నారు. ఒకరు ఓటమితో ప్రస్థానాన్ని ప్రారంభించి.. గెలుపును అందుకున్నారు. మరొకరు విపరీతమైన సెంటిమెంట్ ప్రభావంతో గెలుపును అందుకొని.. భారీ ఓటమి మూటగట్టుకున్నారు. ఇద్దరికీ స్పష్టమైన తేడా ఉంది. అయితే పవన్ ఒక పద్ధతి ప్రకారం రాజకీయం చేస్తుండగా.. జగన్ తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారు.వైయస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసుడిగా కాంగ్రెస్ పార్టీ ఎంపీగా పొలిటికల్ ఎంట్రీ అదుర్స్ అనిపించారు జగన్మోహన్ రెడ్డి తండ్రి అకస్మిక మరణంతో వచ్చిన సెంటిమెంటును గుర్తించి ఓదార్పు యాత్రతో తనకు అనుకూలంగా మార్చుకున్నారు. అయితే ఒక రకమైన దూకుడు రాజకీయాన్ని అలవాటు చేసుకున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వచ్చిన తరువాత పూర్తిగా పొలిటికల్ సీన్ మారిపోయింది. అప్పటివరకు ఉన్న రాజకీయ హుందాతనం పూర్తిగా మారిపోయింది. రాజకీయ వికృత క్రీడతో వ్యక్తిత్వ హరణం మొదలైంది అప్పటి నుంచే.అసలు రాజకీయాలతో సంబంధం లేని మహిళలను రాజకీయ వేదికలు ఎక్కించారు. వారితో సాటి మహిళలను ఆ గౌరవంగా మాట్లాడించారు. ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన చట్టసభల్లో మహిళల ఆత్మగౌరవం దెబ్బతీసేలా వ్యాఖ్యానాలు చేశారు. రక్త సంబంధాలు, కుటుంబ సభ్యుల హత్యలను కూడా రాజకీయానికి వాడుకోవచ్చు అని నేటి తరానికి చేసి చూపించింది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ. ఒకే ఒక్క ఛాన్స్ అవకాశం ఇస్తే రాష్ట్ర రాజధానిని మూడు ముక్కలు



చేస్తానని చేసి చూపించారు జగన్. అధికారం అనేది ప్రజల ప్రగతి కోసం కాదు.. ప్రత్యర్థి నేతల రాజకీయ కక్ష సాధింపుల కోసమని భావించారు జగన్మోహన్ రెడ్డి.పవన్ కళ్యాణ్ జనసేన ప్రస్థానాన్ని పరిశీలిస్తే మాత్రం.. తాము అధికారం కోసం కాదు ప్రజల గొంతుకై పని చేస్తామని చెప్పారు పవన్ కళ్యాణ్. ఎన్నెన్నో అవమానాలు, మరెన్నో అవహేళనలు ఎదుర్కొని.. మూడు పెళ్లిళ్లు అనే వ్యక్తిగత దాడిని భరిస్తూ.. ఓటమి అనే భారాన్ని అధిగమిస్తూ ముందుకు సాగారు పవన్ కళ్యాణ్. 100% సాలిడ్ గెలుపుతో.. అధికారం ఎవరి సొత్తు కాదు అని తేల్చి చెప్పారు. రాష్ట్ర బాగు కోసం తన స్థాయిని తగ్గించుకున్నారు. రాష్ట్ర ప్రజల ప్రగతి కోసం తన పార్టీ స్థానాన్ని కూడా తగ్గించుకొని మరి నెగ్గారు పవన్. అనుభవానికి పెద్ద పీట వేస్తూ చంద్రబాబు నాయకత్వానికి జై కొట్టారు. ప్రభుత్వం అంటే అందలం ఎత్తడం కాదు.. ప్రజల కోసం పనిచేయడం అని చాటి చెప్పారు. జగన్ మూడు రాజధానులతో ప్రాంతాలను, ప్రజలను విడగొడితే.. పవన్ మాత్రం మూడు పార్టీలతో జత కలిసి ఈ రాష్ట్ర భవితను మారుస్తున్నారు. అందుకే ఆ నేతలు ఇద్దరి మధ్య వైరుధ్యం పై మేధావులు ఎక్కువగా ఆలోచిస్తుంటారు. మొన్నటి వరకు పవన్ కళ్యాణ్ పై సినీ అభిమానమే ఉండేది. కానీ మేధావులతో పాటు తటస్థుల అభిమానాన్ని పొందుతున్నారు తన చర్యలతో పవన్.

# జాబ్ క్యాలెండర్ రెడీ...

విజయవాడ మార్చి 16,

ఏపీ ప్రభుత్వం దూకుడు మీద ఉంది. దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటోంది. నిన్ననే రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేసింది. ఇప్పుడు ఉగాదికి మరో ప్రకటన రానుంది. జాబ్ క్యాలెండర్ ను ప్రకటించనుంది. అందుకు సంబంధించి తుది కసరత్తు జరుగుతోంది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు పోస్టుల వారీగా ప్రకటన చేయనున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖకు కూడా ప్రతిపాదనలు అందాయి. ప్రభుత్వం అధికారికంగానే జాబ్ క్యాలెండర్ విడుదల చేయనుంది. ఉపాధ్యాయ పోస్టులతో పాటు దాదాపు పదివేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు కూడా విడుదల చేయనుంది ఏపీ ప్రభుత్వం. ముందుగా ఉగాదికి ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను జాబ్ క్యాలెండర్ ల రూపంలో ప్రకటించనుంది.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన భర్తీ జరిగింది. పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు, కానిస్టేబుళ్ళ భర్తీ జరిగింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో పెద్ద ఎత్తున నియామకాలు కూడా జరిగాయి. అయితే మిగతా ఖాళీల భర్తీకి సంబంధించి కూడా ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందుకే ఉగాది నాడు ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను వివరిస్తూ జాబ్ క్యాలెండర్ విడుదల చేయనుంది. దాదాపు 60 ప్రభుత్వ విభాగాల్లో 10 వేల పోస్టుల భర్తీకి జాబ్ క్యాలెండర్ను కొత్త సంవత్సరానికి ప్రకటించనుంది. ఆర్థిక శాఖ ఆమోదం తర్వాత ఈ పోస్టుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

× ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు..

ఆర్థిక శాఖకు కీలకమైన ప్రతిపాదనలు వచ్చిన నేపథ్యంలో సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయింది ఆర్థిక శాఖ. శాఖల వారీగా వివరాలు సేకరించింది. కొన్ని పోస్టులకు ఇప్పటికే ఆమోదం లభించింది. మరికొన్ని ఆ శాఖల పరిశీలనలో ఉన్నాయి. మరో రెండు మూడు రోజుల్లో ఈ పోస్టులపై ఒక క్లారిటీ రానుంది.

× ఇప్పటివరకు ఆర్థిక శాఖ ఆమోదం లభించిన పోస్టుల్లో 470 గ్రూప్ 2 పోస్టులు, 101 గ్రూప్ 1 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ లభించింది.

× ప్రభుత్వం ఇప్పటికే మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేసింది. ఈ ఏడాది మరో 3 వేల పోస్టుల భర్తీకి జాబ్ క్యాలెండర్ లో పొందుపరచనుంది. యూనివర్సిటీలో బోధన సిబ్బంది పోస్టులకు సంబంధించి పదిహేను వందలు భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ఒంటిమిట్టలో నిరంతరాయంగా అన్నప్రసాదాల వితరణ - టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు

ఒంటిమిట్ట / తిరుపతి, 2026, మార్చి 16.

ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు పంపిణి చేస్తామని టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. ఒంటిమిట్టలోని పరిపాలనా భవనంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు

ఒంటిమిట్టలో శ్రీకోదండ రామస్వామిబ్రహ్మోత్సవాలు ఈనెల 27వ తేదీ నుండి ఏప్రిల్ 5 తేదీ వరకు 9 రోజులు పాటు వైభవంగా నిర్వహిస్తామన్నారు.- రాష్ట్ర విభజన అనంతరం శ్రీరామనవమి ఉత్సవాలు ఒంటిమిట్టలో రాష్ట్ర పండుగ నిర్వహిస్తున్నాం- టిటిడి ఆధ్వర్యంలో 2016 నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు శ్రీ రాముల వారి కళ్యాణం నిర్వహిస్తున్నాం. - 14వ శతాబ్దంలో ఆలయ నిర్మాణం ప్రారంభమై 17వ శతాబ్దంలో ముగిసిందని శాసనాలు చెబుతున్నాయి- క్రీ. శ 1356లో బుక్కరాయలు ఈ ఆలయాన్ని నిర్మాణం ప్రారంభించారు- విజయనగర రాజులు అంతరాలయము ,రంగ మండపం ,మహా ప్రాంగణం గోపురం నిర్మించారు ఏప్రిల్ 1 తేదీ సీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

- రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు- శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసేభక్తులకు ఉచితంగా రూ. 50 విలువగల శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని అందిస్తాం.- భక్తులకు అన్నప్రసాదాలు త్రాగు నీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణి చేస్తాం

- జిల్లా అధికారులు, టిటిడి సమన్వయంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు చేస్తున్నాం. - శ్రీ సీతారాముల కళ్యాణాన్ని ప్రపంచవ్యాప్తంగా వీక్షించడానికి ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారాలు అందిస్తాం.- రూ. 4 కోట్ల రూపాయలతో విద్యుత్ దీపాలంకరణ ఎల్ఈడి , పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు- రూ. 20. 17 కోట్లతో 108 అడుగుల జాంబవంతుడు విగ్రహం నిర్మించేలా చర్యలు చేపడుతున్నాం- మాస్టర్ ప్లాన్ లో భాగంలో 37 కోట్లతో 100 గదులు నిర్మిస్తున్నాం

- ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఈరోజు నుంచి ఒంటిమిట్టలో భక్తులకు మూడు పూటలా అన్నప్రసాదాలు అందిస్తున్నాం.

అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని ప్రారంభించిన టిటిడి ఛైర్మెన్

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామాలయానికి ఎదురుగా ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. గత ఏడాది శ్రీ సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా ఒంటిమిట్టకు విచ్చేసే భక్తులకు అన్నప్రసాదాలను నిరంతరంగా అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూచనల మేరకు అన్నప్రసాద కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. భక్తులకు అన్నప్రసాదాలను అందించేందుకు జర్మన్ షెడ్ ను ఏర్పాటు చేశారు. అందులో భక్తులు కూర్చుని అన్నప్రసాదాలు స్వీకరించేలా ఏర్పాట్లు చేశారు.ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారిని దర్శించుకున్న టిటిడి ఛైర్మెన్అంతకుముందు శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయంలో స్వామివారిని టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు దర్శించుకున్నారు. ఆలయం వద్దకు రాగానే ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం టిటిడి ఛైర్మెన్ కు తీర్థప్రసాదాలను అందించారు.కల్యాణ వేదికను పరిశీలించిన టిటిడి ఛైర్మెన్ఏప్రిల్ 1న జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లను టిటిడి ఛైర్మెన్ పరిశీలించారు.

# టీడీపీ కార్యక్రమాలకు పుట్టా మహేష్ దూరం

ఏలూరు, విజయవాడ, మార్చి 16,

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ డ్రగ్స్ కేసులో పట్టుబడటంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అత్యంత కఠినంగా స్పందించారు. పార్టీ క్రమశిక్షణ, నైతిక విలువల విషయంలో



రాజీ పడే ప్రసక్తి లేదని స్పష్టం చేస్తూ, ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక సమర్పించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి ఆరోపణలు రావడం పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తుందని ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పార్టీ అధిష్టానం తక్షణమే రంగంలోకి దిగింది. ఎంపీ పుట్టా మహేష్‌ను పార్టీ కార్యక్రమాలన్నింటికీ తక్షణమే దూరం పెడుతున్నట్లు ప్రకటించింది. రాజకీయాలకు అతీతంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్న తరుణంలో, సొంత పార్టీ ఎంపీపైనే ఇలాంటి ఆరోపణలు రావడంతో అధిష్టానం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. కేసు విచారణ పూర్తయ్యే వరకు ఆయన పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనకుండా నిషేధం విధించినట్లు సమాచారం. అంతేకాకుండా, ఈ ఘటనపై వివరణ కోరుతూ పుట్టా మహేష్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పల్లా శ్రీనివాసరావును చంద్రబాబు ఆదేశించారు. నిర్దేశిత సమయంలోగా తనపై వచ్చిన ఆరోపణలపై తగిన వివరణ ఇవ్వాలని, ఒకవేళ అది సంతృప్తికరంగా లేకపోతే తదుపరి చర్యలు ఉంటాయని పార్టీ వర్గాలు హెచ్చరించాయి. సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అల్లుడు అయినప్పటికీ, పార్టీ నిబంధనల విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదని చంద్రబాబు ఈ చర్య ద్వారా సంకేతాలు పంపారు. ఎంపీ వివరణ అనంతరం పార్టీ ఇంకా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

అంతా పొలిటికల్ ఫ్యామిలీ...

గ్స్ కేసులో పట్టుబడ్డ పుట్టా మహేష్ వారసత్వమే అర్హతగా రాజకీయాల్లోకి వచ్చారు. ఆయనకు ఎంపీగా టిక్కెట్ కేటాయించడంలో బలమైన రాజకీయ వారసత్వం, సీనియర్ నేతల అండదండలు కీలక పాత్ర పోషించాయి. ఆయన తండ్రి పుట్టా సుధాకర్ యాదవ్ తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతగా, టీటీడీ మాజీ ఛైర్మన్‌గా పనిచేయడం మహేష్‌కు రాజకీయ ఓనమాలు నేర్పింది. ప్రస్తుతం ఆయన మైదుకూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. మహేష్ కుమార్ కేవలం తన తండ్రి వారసుడిగానే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో దిగ్గజ నేతగా పేరొందిన యనమల రామకృష్ణుడికి అల్లుడు కావడం ఆయన రాజకీయ బలాన్ని రెట్టింపు చేసింది. యనమల వంటి వ్యూహకర్త కుటుంబంతో బంధుత్వం ఉండటం వల్ల పార్టీ అధిష్టానం వద్ద మహేష్‌కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ సమీకరణాల వల్లే యువకుడైనప్పటికీ, 2024 ఎన్నికల్లో ఏలూరు వంటి కీలకమైన పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేసే అవకాశం ఆయనకు దక్కింది. మహేష్ కుమార్ భార్య యనమల దివ్య కూడా ప్రస్తుతం తుని ఎమ్మెల్యేగా ఉన్నారు. అదే సమయంలో తెలంగాణలోని బలమైన యాదవ సామాజిక వర్గ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబంతో ఉన్న వియ్యం కూడా మహేష్‌కు అదనపు బలాన్ని చేకూర్చింది. మహేష్ కుమార్ సోదరిని తలసాని కుమారుడు సాయికిరణ్ వివాహం చేసుకున్నారు. ఇలా రెండు రాష్ట్రాల్లోని ముగ్గురు సీనియర్ నేతల నీడలో మహేష్ రాజకీయం సాగుతోంది. ఈ భారీ రాజకీయ నేపథ్యం వల్లే ఆయనకు అనతి కాలంలోనే ఎంపీగా ఎదిగే అవకాశాలు వచ్చాయి. అయితే ఇప్పుడు డ్రగ్స్ కేసులో ఇరుక్కుని ఆయన తీవ్ర వివాదాస్పదం అయ్యారు. కొద్దిరోజులకు ఆయన కేసు నుంచి బయటపడతారేమో కానీ రాజకీయంగా మరోసారి అవకాశాలు రావడం మాత్రం కష్టమని అనుకోవచ్చు.

# చిల్కానగర్లో ఏఆర్ కానిస్టేబుల్ హత్య

మేడ్చల్ మార్చి 16,

ఉప్పల్ పిఎస్ పరిధి చిలకానగర్ లో ఆదివారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. చిలకానగర్ ఆదర్శనగర్లోని సాయిబాబా ఆలయం సమీపంలో జరిగిన కత్తిపోటు ఘటనలో ఏఆర్ కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. చెంగిచెర్లలోని ఆర్టీసీ కాలనీకి చెందిన సుధీర్ కుమార్ (39), హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ వింగ్లో ఏఆర్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో ఆదర్శనగర్, చిల్కానగర్లోని సాయిబాబా ఆలయం సమీపంలో ఉండగా, అతని స్నేహితుడైన సంతోష్ నాయక్ కత్తితో దాడి చేసినట్లు తెలుస్తుంది.

సంతోష్ నాయక్ సుధీర్ కుమార్ ని కడుపు మరియు మెడ భాగాల్లో కత్తితో పొడవడంతో, తీవ్ర గాయాల కారణంగా సుధీర్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది. మృతుడు మరియు నిందితుడు ఇద్దరూ స్నేహితులేనని, అయితే హత్యకు గల అసలు కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించనున్నారు. కేసు నమోదు చేసి పరారీలో ఉన్న నిందితుడు సంతోష్ నాయక్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

========================

# రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

విశాఖపట్నం మార్చి 16,

విశాఖపట్నంలో మరో విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విశాఖ డైరీ సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ఒక యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మరో యువతి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మృతురాలిని ఆడారి మహాలక్ష్మిగా, గాయపడిన యువతిని చిప్పాడ అనూషగా గుర్తించారు. స్థానికుల మాటల్లో? వాహనం అతివేగంతో వచ్చి రోడ్డుపక్కన ఉన్న పోల్ను బలంగా ఢీకొట్టిందని చెబుతున్నారు. ఢీకొట్టిన వేగానికి యువతులు బంతుల్లా ఎగిరి రోడ్డుపై పడిపోయినట్లు అక్కడ ఉన్నవారు చెబుతున్నారు.

=======================

# డీజీపీ సమక్షంలో 11 మంది మావోయిస్టులు సరెండర్

భువనేశ్వర్ మార్చి 16,

ఒడిశాలోని కలహాండి జిల్లాలో డీజీపీ ఖురానియా సమక్షంలో డివిజనల్ కమిటీ సభ్యుడు నకుల్ సహా 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఐదుగురు ఏరియా కమిటీ సభ్యులు, ఐదుగురు పార్టీ క్యాడర్లు ఉన్నారు. వీరు ఒక ఏకే 47, ఒక ఇన్సాస్, నాలుగు ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, నాలుగు సింగిల్ షాట్ తుపాకులు, భారీ మందుగుండు సామాగ్రిని పోలీసులకు అప్పగించారు. మహారాష్ట్రకు చెందిన నకుల్ ఒడిశా రాష్ట్ర కమిటీలో డిసిఎంగా పనిచేస్తున్నారు, అతనిపై రూ. 22 లక్షల రివార్డు ఉంది.

# ఎంపి పుట్టా వ్యవహారం పై సీఎం చంద్రబాబు ఆగ్రహం

విజయవాడ మార్చి 16, టీడీపీ పుట్టా మహేశ్ డ్రగ్స్ వ్యవహారంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు.. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించారు.. ఘటనపై వివరణ కోరుతూ మహేష్ కు నోటీసులు ఇవ్వాలని,పూర్తి నివేదిక తనకు సమర్పించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కు సూచించారు. డ్రగ్స్ కేసుల్లో ఎవరున్నా ఉపేక్షించేది లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. నేతల బలహీనతలు,తప్పులకు పార్టీ నష్టపోయే పరిస్థితి రానివ్వనని తేల్చిచెప్పారు..

# దుష్ప్రచారాలు నమ్మవద్దు.. ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ఏలూరుూడ మార్చి 16, హైదరాబాద్ మొయినాబాద్ లో జరిగిన డిన్నర్ పార్టీ సంఘటనలో తనపై వచ్చిన కథనాలను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఖండించారు. ఆదివారం పోలీసు విచారణ ముగించుకుని హైదరాబాద్ లోని తన నివాసానికి చేరుకున్న ఎంపీ మీడియాకు వీడియో ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. తాను ఎలాంటి వ్యక్తినో రెండేళ్లుగా ఏలూరు ప్రజలు, పార్టీ నేతలు, కార్యకర్తలు అందరికీ తెలుసునన్నారు. తనకు ఎటువంటి దురలవాట్లు లేవని, ఏ తప్పు చేయలేదని, కేవలం ఒక స్నేహితుడు పిలిస్తే కలవడానికి మాత్రమే మొయినాబాద్ వెళ్ళానని, కలిసి వచ్చే సమయంలో జరిగిన కొన్ని సంఘటనలపై మీడియాలో రకరకాల కథనాలు వచ్చాయని, వాటిని ఎవ్వరూ నమ్మవద్దని, పోలీసు విచారణకు సహకరిస్తానని, పూర్తి వివరాలతో త్వరలో ప్రజల ముందుకు వస్తానని ఎంపీ తన ప్రకటనలో తెలిపారు

# బీజేపీ బిగ్ ఆఫర్... లైట్ తీసుకున్న విజయ్

చెన్నై, మార్చి 16, (

మిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. తమిళ వెట్రి కళగం అధినేత, నటుడు విజయ్‌ను తమ కూటమిలోకి తెచ్చుకునేందుకు భారతీయ జనతా పార్టీ .. చివరిగా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా విజయ్‌కు బిజెపి అధిష్టానం బంపర్ ఆఫర్ ప్రకటించినట్లు తెలుస్తోంది. పొత్తులో భాగంగా టీవీకేకు 80 అసెంబ్లీ సీట్లతో పాటు, ఎన్నికల అనంతరం విజయ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవిని ఇచ్చేందుకు కూడా బిజెపి ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే, బిజెపి ఇచ్చిన ఈ భారీ ఆఫర్ పట్ల విజయ్ ఏమాత్రం ఆసక్తి చూపడం లేదని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తన పార్టీ సిద్ధాంతాలకు, బిజెపి భావజాలానికి పొంతన లేదని భావిస్తున్న విజయ్, ప్రస్తుతం ఒంటరిగానే బరిలోకి దిగాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు బీజేపీ ఈ ఆఫర్ విజయకు పంపింది. జాతీయ పార్టీతో చేతులు కలిపితే తన పార్టీ మూలాలకే ముప్పు వస్తుందని విజయ్ పొత్తు ఆలోచనలు అసలు పెట్టుకోలేదని తెలుస్తోంది. చాలా ఒత్తిడి వచ్చినప్పటికీ విజయ్ తగ్గడం లేదు. రాష్ట్రంలో డీఎంకే వంటి బలమైన శక్తిని ఎదుర్కోవాలంటే విజయ్ వంటి ప్రజాకర్షణ ఉన్న నాయకుడి మద్దతు అవసరమని బిజెపి భావిస్తోంది. అందుకే గత కొంతకాలంగా విజయ్‌తో సంప్రదింపులు జరుపుతోంది. 80 సీట్లు ఇవ్వడం ద్వారా కూటమిలో టీవీకేను కీలక భాగస్వామిని చేయాలని బిజెపి యోచించినా, విజయ్ మాత్రం తన రాజకీయ స్వయంప్రతిపత్తిని కాపాడుకోవడానికే మొగ్గు చూపుతున్నారు. బిజెపి ఆఫర్ చేసిన డిప్యూటీ సీఎం పదవిని కూడా ఆయన సున్నితంగా తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. విజయ్ నిర్ణయంతో



తమిళనాడులో త్రిముఖ పోటీ ఖాయమని అర్థమవుతోంది. డీఎంకే నేతృత్వంలోని కూటమి ఒకవైపు, ఏఐఏడీఎంకే, బీజేపీ కూటమి మరోవైపు ఉండగా.. విజయ్ తన టీవీకే పార్టీతో మూడవ శక్తిగా అవతరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బిజెపి ఆఫర్‌ను తిరస్కరించడం ద్వారా తాను ఎవరికీ బి-టీమ్ కాదని, స్వతంత్రంగా ప్రజల తీర్పును కోరుకుంటున్నానని విజయ్ స్పష్టమైన సంకేతాలు పంపినట్లయింది. ఈ పరిణామం రాబోయే ఎన్నికల్లో ఓట్ల చీలికకు దారితీస్తుందా లేదా విజయ్ కింగ్‌మేకర్‌గా మారుతారా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది

# కొప్పోలి సమీపంలో రోడ్డు ప్రమాదం

## కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని - యువకుడు మృతి

కడప మార్చి 16, (

వల్లూరు మండల పరిధిలోని కొప్పోలి బస్టాండ్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది..కడప తాడిపత్రి జాతీయ రహదారిలో కొప్పోలి బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనంను కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది..ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు, ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన యువకుడిని 108 అంబులెన్స్ ద్వారా కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు..అయితే ఆసుపత్రికి చేరుకునేలోపే అతను మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు..మృతుడు కొప్పోలి గ్రామానికి చెందిన బాలాజీ 26గా గుర్తించారు..విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న వల్లూరు ఎస్సై శివ నాగిరెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు..అనంతరం కేసు నమోదు చేసి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలపై విచారణ చేపట్టారు..ఈ ఘటనతో కొప్పోలి గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది..యువకుడి మృతితో కుటుంబ సభ్యులు గ్రామస్తులు తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు..

# దూడను చంపిన పులి

కాకినాడ మార్చి 16, (

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో 17 రోజులుగా పెద్దపులి సంచారం స్థానికులకు నిద్ర లేకుండా చేస్తోంది. పులి ని పట్టుకునేందుకు అటవీశాఖ ప్రత్యేక బృందాల ప్రయత్నాలు కొనసాగుతున్నా ఇప్పటివరకు ఫలితం లేదు. ఆదివారం రాత్రి శంఖవరం మండలం మండపం వద్ద పోలం బూరయ్య అనే రైతు గేదె దూడ పై పులి దాడిచేసింది. ప్రస్తుతం శంఖవరం మండలం జి.కొత్తపల్లి సమీపంలో పెద్దపులి వున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రత్తిపాడు లేదా రౌతులపూడి మండలాల వైపు పయనించే అవకాశం వుందని సమాచారం...

# శ్రీరామ్ వేధింపులను నిలువరించండి - బాధితుడు కృష్ణ చైతన్య

శ్రీరామ్ సంస్థ వేధింపుల నుంచి తమను కాపాడాలని బాధితుడు కృష్ణ చైతన్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన గోడును మీడియాకు వివరించారు. వ్యాపార అవసరాల నిమిత్తం భువనగిరి శ్రీరామ్ ఫైనాన్స్ లో తాను రుణాన్ని తీసుకున్నట్లు తెలిపారు. సదరు సంస్థ సూచించిన విధంగా ప్రతినెల వాయిదాల పద్ధతిలో రుణాన్ని తిరిగి చెల్లించినప్పటికీ తనను తీవ్రంగా వేధిస్తుందని ఆరోపించారు. సంస్థ లీగల్ అడ్వైజర్ శ్రీనివాస్ రెడ్డి తనతో పాటు తనకు షూరిటీగా ఉన్న సంతోష్ కుమార్ ను తీవ్రంగా మానసిక ఒత్తిడికి గురి చేశారని ఆరోపించారు. సంస్థ వేధింపుల కారణంగానే అనారోగ్యానికి గురైన సంతోష్ కుమార్ ఇటీవలే చికిత్స పొందుతూ నిమ్స్ ఆసుపత్రిలో మృత్యువాత పడ్డాడని కన్నీరు పెట్టుకున్నారు. ఈ విషయంపై తాను ఆర్బిఐ కి ఫిర్యాదు చేసినా వేధింపులు ఆగలేదని వాపోయారు. రుణ గ్రహీతలను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్న ఫైనాన్స్ సంస్థలపై కఠినమైన చర్యలు తీసుకొని తమలాంటి వారికి న్యాయం చేయాలని కోరారు.

================================

# కొత్త పన్నుల కోసం ప్రయత్నాలు

## 16 దేశాలపై మరోసారి ఫోకస్ చేసిన ట్రంప్!

చెన్నై, మార్చి 16,

అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ భారత్, చైనా, బంగ్లాదేశ్ సహా 16 ప్రధాన వాణిజ్య భాగస్వాములపై ??కొత్త ఎంక్వయిరీ ప్రారంభించింది. ఈ దర్యాప్తును యుఎస్ వాణిజ్య చట్టం 1974లోని సెక్షన్ 301 కింద నిర్వహిస్తున్నారు. ఈ చట్టం ప్రకారం, అమెరికా ఏ దేశంపైనా టారిఫ్స్ లేదా దిగుమతి పన్నులను పెంచవచ్చు. గత నెలలో యుఎస్ సుప్రీంకోర్టు ట్రంప్ పరిపాలన విధించిన సుంకాలను చట్టవిరుద్ధమని ప్రకటించి వాటిని కొట్టివేసిన తర్వాత ఈ చర్య వచ్చింది. దీని తరువాత, యుఎస్ ఇప్పుడు కొత్త దర్యాప్తు ద్వారా మళ్ళీ ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. దర్యాప్తులో అవకతవకలు బయటపడితే, అనేక దేశాలపై కొత్త సుంకాలు విధించే అవకాశం ఉందని అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ అన్నారు. దీని ప్రభావం పడే దేశాలలో చైనా, యూరోపియన్ యూనియన్, భారత్, జపాన్, దక్షిణ కొరియా, మెక్సికో ఉన్నాయి. ఈ దర్యాప్తు అధిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న దేశాలను లేదా అమెరికాకు వస్తువులను విక్రయించే దేశాలను లక్ష్యంగా చేసుకుంది. ఇది దేశీయ పరిశ్రమలకు ఇబ్బంది కలిగిస్తుందని అమెరికా చెబుతోంది. దర్యాప్తులో చేర్చిన ఇతర దేశాల్లో తైవాన్, వియత్నాం, థాయిలాండ్, మలేషియా, కంబోడియా, సింగపూర్, ఇండోనేషియా, బంగ్లాదేశ్, స్విట్జర్లాండ్, నార్వే ఉన్నాయి. అమెరికా రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అయిన కెనడాను మాత్రం ఈ జాబితాలో చేర్చలేదు. ఈ దర్యాప్తు 60 కంటే ఎక్కువ దేశాలను కవర్ చేయనుంది. గతంలో, చైనాలోని జిన్జియాంగ్ ప్రాంతం నుంచి దిగుమతి అయ్యే సౌర ఫలకాలు, ఇతర ఉత్పత్తులపై అమెరికా చర్య తీసుకుంది. ఈ చర్య ఉయ్ఘర్ ఫోర్స్డ్ లేబర్ ప్రొటెక్షన్ చట్టం కింద తీసుకుంది, ఇది మాజీ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పరిపాలనలో ఆమోదించారు. చైనాలోని జిన్జియాంగ్ ప్రాంతంలో ఉయ్ఘర్ ముస్లిం కమ్యూనిటీ సభ్యులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని అమెరికా ఆరోపిస్తోంది. అయితే, చైనా ఈ ఆరోపణలను ఖండిస్తూనే ఉంది. ఈ దర్యాప్తు త్వరగా పూర్తి అయ్యేందుకు గడువు విధించారు. ఏప్రిల్ 15 వరకు అభిప్రాయాలను తీసుకుంటుంది. మే 5వ తేదీ నాటికి బహిరంగ విచారణ జరుగుతుంది. ఆ తర్వాత జూలై నాటికి దర్యాప్తు పూర్తి చేయాలని ప్లాన్ చేశారు. యూఎస్ వాణిజ్య లోటును తగ్గించి, దేశీయ తయారీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ చర్యను ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ చెబుతోంది.

సెక్షన్ 301 అంటే ఏమిటి?

1974 నాటి యూఎస్ వాణిజ్య చట్టంలో సెక్షన్ 301 ఒక కీలకమైన భాగం. ఏదైనా దేశం అన్యాయమైన లేదా చట్ట వ్యతిరేక వాణిజ్య పద్ధతుల్లో వ్యాపారం చేస్తుందని యూఎస్ విశ్వసించినప్పుడు ఈ చట్టం ప్రయోగిస్తుంది. ఈ చట్టం ప్రకారం, యూఎస్ ఆ దేశంపై దర్యాప్తు ప్రారంభించవచ్చు. అవసరమైతే, సుంకాలు లేదా ఇతర వాణిజ్య పరిమితులను విధించవచ్చు. ఈ చట్టం ప్రకారం, యూఎస్ ప్రభుత్వ వాణిజ్య విభాగం అయిన యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ కార్యాలయం ఒక దేశ వాణిజ్య విధానాలను పరిశీలిస్తుంది.

# ప్రతిపక్ష పార్టీ అయ్యేలా కవిత వ్యూహమా?

హైదరాబాద్, మార్చి 16,

ఐయామ్ వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్. ప్రజల గొంతుగా నిలబడతా. ఎప్పుడో ఓసారి తెలంగాణకు ముఖ్యమంత్రిని అయి తీరుతా. జాగృతి అధ్యక్షురాలు కవిత స్టేట్‌మెంట్స్ ఇవి. బీఆర్ఎస్‌ను వీడినప్పటి నుంచి ప్రత్యేక రాజకీయ ఎజెండాతో ముందుకెళ్తున్న కవిత.. ఓవైపు పార్టీ ఏర్పాటు కోసం కసరత్తు చేస్తూనే..అసలు సిసలు ప్లాన్‌ను ఇంప్లిమెంట్ చేస్తున్నారు. పరిస్థితులను బట్టి..పొలిటికల్ ఈక్వేషన్స్ బేరీజు వేసుకుని..ఆల్ ఆఫ్ సడెన్‌గా ప్రజా సమస్యలపై ఫోకస్ పెట్టారు. వరుస కార్యక్రమాలు, మెరుపు ధర్నాలు, దీక్షలతో అధికార కాంగ్రెస్ తీరుపై నిరసన తెలుపుతూనే..ఇటు బీఆర్ఎస్, బీజేపీపై విమర్శల దాడిని కంటిన్యూ చేస్తున్నారు. ఓ రకంగా తానే అసలైన ప్రతిపక్షం అన్న లెవల్‌కు ఎదిగేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారట కల్వకుంట్ల కవిత. త్వరలోనే రాజకీయ పార్టీని ప్రకటించేందుకు రెడీ అవుతున్నారు కవిత. అంతలోపే అంశాల వారీగా తనదైన శైలితో పోరాటం మొదలుపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలపై ఫైట్ చేస్తూ వస్తున్నారు. చిన్న పెద్ద అని తేడా లేకుండా తన దృష్టికి వచ్చిన ప్రతి అంశంపై రియాక్ట్ అవుతున్నారు కవిత. హైదరాబాద్ నుంచి మొదలు రాష్ట్రంలో ఎక్కడ ప్రజల సమస్యలు ఉంటే అక్కడికి వెళ్తున్నారామె. అంశాన్ని బట్టి నిరసనలు, ధర్నాలు చేస్తూ..వార్తల్లో నిలుస్తున్నారు. ఇక సమస్య తీవ్రతను బట్టి మెరుపు దీక్షలు, చివరికి ఆమరణ నిరాహార దీక్షకు కూడా దీగడంతో కవిత రాజకీయ వ్యూహంపై అసక్తికరమైన చర్చ మొదలైంది. జనం బాట పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన కవిత..ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ వస్తున్నారు. నిరుద్యోగుల కోసం ఇందిరా పార్క్ దగ్గర దీక్ష చేశారు కవిత. హైదరాబాద్‌లో మూసీ పక్కన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ అక్రమంగా నిర్మాణాలు చేస్తోందని మెరుపు ధర్నాతో నిరసన తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా మహిళలకు 2,500 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా భవన్ ముందు ధర్నా నిర్వహించారు కవిత. జోగులాంబ గద్వాల జిల్లాలో పత్తి రైతుల సమస్యలపై కలెక్టరేట్ దగ్గర ప్రొటెస్ట్ చేశారు. రైతు సంఘర్షణ సభ తర్వాత కలెక్టరేట్‌కు వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో, అక్కడే బైఠాయించి నిరసన తెలిపి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. లేటెస్ట్‌గా ఖమ్మం వెలుగుమట్ల బాధితుల తరపున కవిత ఏకంగా నిరాహార దీక్ష చేయడం పొలిటికల్ హాట్ టాపిక్ అయింది. వెలుగుమట్ల బాధితుల ఇళ్లు కూల్చడాన్ని నిరసిస్తూ



ఆందోళన చేపట్టిన కవిత..మళ్లీ అక్కడే వాళ్లకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న డిమాండ్‌తో ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఖమ్మంలో దీక్ష చేస్తున్న కవితను పోలీసులు హైదరాబాద్ తరలించినా..దీక్షను కొనసాగించారు. చివరికి ప్రభుత్వం వెలుగుమట్ల బాదితులకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో మూడు రోజుల నిరాహార దీక్షను విరమించారు కవిత. ఇలా వరుసగా ప్రజా సమస్యలపై నిరసనలు, పోరాటాలు, దీక్షలు చేయడం వెనుక ఆమె రాజకీయ వ్యూహం ఏమై ఉంటుందన్న చర్చ మొదలైంది. అంత ఆశామాషీగా కవిత ఇదంతా చేయడం లేదని, ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారని చెబుతున్నారు. వచ్చే నెలలో రాజకీయ పార్టీని ప్రకటించబోతున్న కవిత..అంతకుముందే తనను తాను ప్రూవ్ చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, జనం పక్షాన నిలుస్తున్నాననే ఇండికేషన్ ఇచ్చేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ప్రతిపక్ష, విపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలను వెనక్కినెట్టి తాను అపోజిషన్ రోల్ ప్లే చేయాలని కవిత స్కెచ్ వేస్తున్నట్లు చెబుతున్నారు. నిరసనలు, ధర్నాలు, దీక్షలు చేయడం ద్వారా బీఆర్ఎస్, బీజేపీల కంటే ఎక్కువగా తాను జనంలో ఉంటూ పబ్లిక్ వాయిస్‌గా ఎస్టాబ్లిష్ అయ్యే ప్రయత్నం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. తానే అసలైన ప్రతిపక్ష పాత్ర పోషించబోతున్నట్లు చెప్పకనే చెప్పే ప్రయత్నం చేస్తున్నారట కవిత. రాజకీయ పార్టీ పెట్టాక మరింత దూకుడు పెంచి బీఆర్ఎస్, బీజేపీకి ఆల్టర్‌నేట్ అయ్యేలా వ్యూహం అమలు చేస్తున్నారట. తెలంగాణ పొలిటికల్ సినారియోలో కవిత ప్లాన్ లు ఎంత వరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

# మల్లారెడ్డి... ఆయన కోడలు

## జోరుగా... హుషారుగా...

హైదరాబాద్, మార్చి 16,

కొందరికి ఏజ్ పెరుగుతుంటే రకరకాల వ్యాధులు వస్తుంటాయి. మరికొందరికి ఏమో ఏజ్ పెరుగుతుంటే ఎక్కడా లేని ఉత్సాహం వస్తూ ఉంటుంది. పైగా యుక్త వయసులో ఉన్నప్పుడు చేయలేని పనులను ఈ ఏజ్ లో చేస్తుంటారు. ఈ జాబితాలో మాజీ మంత్రి మల్లారెడ్డి అలియాస్ పాల మల్లారెడ్డి ముందు వరుసలో ఉంటారు. పాలమ్మిన, పూలమ్మిన, కష్టపడ్డ, సక్సెస్ ఐన.. అని అప్పట్లో మల్లారెడ్డి చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాను ఊపేసింది. ఆ తర్వాత ఆయన సోషల్ మీడియా స్టార్ అయిపోయారు. పూలమ్మిన.. పాలమ్మిన.. ఈ డైలాగ్ చెప్పగానే గుర్తొచ్చే పేరు.. మల్లారెడ్డి. టీడీపీలో రాజకీయం మొదలు పెట్టి.. బీఆర్ఎస్‌లో చేరిన చేమకూర మల్లారెడ్డి వ్యాపారంలోనూ, ఇటు రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. మోటివేటర్‌గా ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. ఆయన స్ఫూర్తితో వ్యాపారంలో రాణిస్తున్నారు మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి. మల్లారెడ్డి వారసురాలిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న ప్రీతిరెడ్డి.. రాజకీయ వారసత్వాన్ని పునికిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రీతిరెడ్డి రాజకీయ ప్రవేశం గురించి రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చలు జరుగుతున్నాయి. మల్లారెడ్డి విద్యా సామ్రాజ్యంలో కీలకంగా పనిచేస్తున్న ప్రీతి రెడ్డి ఇటీవల సోషల్ మీడియా ద్వారా ఎలివేట్ అయ్యారు. ఈ సమావేశాల్లో ఆమె విద్యా మౌలిక సదుపాయాలు, ప్రాంతీయ అభివృద్ధి విషయాలతోపాటు ఆర్థిక అసమానతలు, దారిద్ర్య నిర్మూలన, స్త్రీల ఆర్థిక స్వాతంత్ర్యం, యువతకు అవకాశాలు వంటి విస్తృత అంశాలపై చర్చించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్యా, ఉపాధి అవకాశాలు పెంచాలని, సామాజిక న్యాయం అందించాలని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ఆమెను సామాన్యుల సమస్యలకు సున్నితంగా ఉన్న నాయకురాలిగా చిత్రీకరిస్తున్నాయి. ప్రీతి రెడ్డి ఇటీవల ఓ ఇంటర్వ్యూల్లో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధానాలను మెచ్చుకున్నారు. ముఖ్యంగా, కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ 2020) ద్వారా విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులు, ఆర్థిక సంస్కరణలు, మహిళా సాధికారత కార్యక్రమాలు గురించి ఆమె ప్రశంసలు ఆకట్టుకున్నాయి. బీజేపీ పాలనలో దేశవ్యాప్త అభివృద్ధి, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలను ఆమె సమర్థించడం గమనార్హం. ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్‌కు బదులు జాతీయ పార్టీతో ఆమె భవిష్యత్తు లింక్‌ను సూచిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రీతిరెడ్డి రాజకీయ ప్రవేశంపై జరుగుతున్న ఊహాగానాలపై మల్లారెడ్డి కుటుంబం స్పందించలేదు. ప్రతీరెడ్డి వ్యాఖ్యలను ఖండించలేదు. మల్లారెడ్డి కుటుంబం ఇప్పటికే తెలంగాణలో బలమైన రాజకీయ, విద్యా



ప్రభావం కలిగి ఉంది. ప్రీతి రెడ్డి ప్రవేశం కుటుంబ ప్రభావాన్ని మరింత బలోపేతం చేస్తుందని అంచనా. రాబోయే స్థానిక ఎన్నికలు లేదా అసెంబ్లీ ఎన్నికల ముందు ఆమె అధికారిక ప్రవేశం జరిగే అవకాశం ఎక్కువ. ప్రీతిరెడ్డి రాజకీయ ప్రవేశం తెలంగాణలో కుటుంబ రాజకీయాలకు కొత్త డైమెన్షన్ ఇస్తుంది. బీఆర్ఎస్‌లోనే చేరినా, ఆమె జాతీయ విధానాల పట్ల ఆకర్షణ బీజేపీతో కూటమి ఏర్పడే సూచనలు ఉన్నాయి. తెలంగాణలో బీజేపీ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో, ఆమె ప్రవేశం పార్టీకి కొత్త యువ, మహిళా ముఖాన్ని ఇస్తుంది. ఇక అప్పటినుంచి మల్లారెడ్డి ఏం మాట్లాడినా సరే.. ఏం చేసినా సరే సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతోంది. వాస్తవానికి మల్లారెడ్డి వయసు ఇప్పుడు ఏడు పదులు దాటింది. అయినప్పటికీ ఆయన యంగ్ గా కనిపిస్తున్నారు. ఉత్సాహానికి ప్రతీకగా దర్శనమిస్తున్నారు. మల్లారెడ్డి తన 50వ వివాహ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ క్రమంలో నిర్వహించిన సంగీత్ వేడుకలో మల్లారెడ్డి అదరగొట్టారు. హుక్ స్టెప్పులతో అలరించారు. వయసు అనేది శరీరానికి మాత్రమేనని.. మనసుకు కాదని ఆయన నిరూపించారు. షేర్వాని ధరించి.. మెడలో గులాబీ కండువా వేసుకొని.. కళ్ళకు గాగుల్స్ తో అచ్చం మాస్ హీరో లాగా కనిపించారు మల్లారెడ్డి. మల్లారెడ్డి వేసిన స్టెప్పుల సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా సర్క్యులేట్ అవుతున్నాయి. "ఒక వయసుకు వచ్చిన తర్వాత శరీరం సహకరించదు. కానీ మల్లారెడ్డి విషయంలో ఇందుకు పూర్తి విరుద్ధం. ఆయనకు అన్ని సహకరిస్తున్నాయి. పట్టిందల్లా బంగారమవుతోంది. దేశవ్యాప్తంగా తన విద్యాసంస్థలను విస్తరిస్తున్నారు మల్లారెడ్డి. అంతటితోనే ఆగడం లేదు. 70 సంవత్సరాల వయసులో కూడా యువకుడి లాగా రెచ్చిపోతున్నారు. ఇది మామూలు విషయం కాదంటూ" నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.

====================

# గులాబీ గూటికి జీవన్ రెడ్డి

కరీంనగర్, మార్చి 16

తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీ మారే అవకాశం కనిపిస్తోంది. జగిత్యాల కాంగ్రెస్ రాజకీయాల్లో జీవన్ రెడ్డికి, ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు మధ్య ఎప్పటి నుంచో పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వైరం ఉంది. గత ఎన్నికల్లో సంజయ్ కుమార్ బీఆర్ఎస్ నుంచి గెలవగా, జీవన్ రెడ్డి ఓటమి పాలయ్యారు. అయితే, అనూహ్యంగా సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం, ఆయనకు ప్రభుత్వం , పార్టీలో ప్రాధాన్యత పెరగడం జీవన్ రెడ్డికి మింగుడుపడటం లేదు. తనను సంప్రదించకుండానే బద్ధ శత్రువును పార్టీలోకి తీసుకోవడం తనను అవమానించడమేనని ఆయన భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. పార్టీపై ఆయన చాలా కాలంగా అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఇటీవల ఆయన తాను పార్ట మారే ఆలోచనలో ఉన్నానని చెబుతున్నారు. ఈ క్రమంలో జీవన్ రెడ్డి ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నెల 20వ తేదీ తర్వాత ఆయన హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలిసి, గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉంది. ఇప్పటికే జగిత్యాలలోని తన అనుచరులతో, కీలక నేతలతో ఆయన వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ మార్పుపై క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ పూర్తి చేశారని, మెజారిటీ అనుచరులు ఆయన నిర్ణయానికి మద్దతు తెలిపారని సమాచారం. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీ వీడకుండా ఉండేందుకు కాంగ్రెస్ అధిష్టానం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి బుజ్జగించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ, సంజయ్ కుమార్ విషయంలో తనకు జరిగిన అన్యాయాన్ని ఆయన గట్టిగా ప్రశ్నిస్తున్నారు. దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడితే, ప్రత్యర్థిని తెచ్చి నెత్తిన కూర్చోబెట్టడం ఏమిటి అని ఆయన తన సన్నిహితుల వద్ద వాపోయినట్లు సమాచారం. ఈ పరిణామా కారాణం ఆయన వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదని చెబుతున్నారు. ఒకవేళ జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరితే, జగిత్యాల నియోజకవర్గంలో సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి.



కాంగ్రెస్ కేడర్‌లో చీలక రావడం ఖాయం. అటు బీఆర్ఎస్‌కు ఈ సీనియర్ నేత రాక పెద్ద బలాన్ని ఇస్తుందని ఆ పార్టీ భావిస్తోంది. పార్టీ మారే అంశంపై జీవన్ రెడ్డి నుంచి త్వరలోనే ఒక అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీతో తాటిపర్తి జీవన్ రెడ్డికి దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా విడదీయలేని అనుబంధం ఉంది. 1980వ దశకంలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, జగిత్యాల నియోజకవర్గం నుండి ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి ఆ ప్రాంతంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రోడ్లు, భవనాల శాఖ వంటి కీలక మంత్రి పదవులను నిర్వహించిన జీవన్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అత్యంత సన్నిహితుడిగా ఉండేవారు. ఓటమి ఎదురైనప్పుడు కూడా పార్టీని వీడకుండా విధేయుడిగా ఉన్న ఆయన తెలంగాణ ఉద్యమం తర్వాత వెనుకబడిపోయారు. వరుసగా ఓడిపోతూ వస్తున్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసినా ఓడిపోయారు

# అద్భుతమైన ఆయిల్ పామ్ రిఫైనరీ

మెదక్, మార్చి 16

తెలంగాణ ప్రభుత్వం సిద్దిపేట జిల్లా నర్మెటలో రూ.300 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోనే అతిపెద్ద ఆయిల్‌పామ్ రిఫైనరీని ఏర్పాటు చేస్తోంది. ఈ నెల 22న సీఎం రేవంత్ రెడ్డి ఈ రిఫైనరీని ప్రారంభించనున్నారు. మలేషియా సాంకేతికతతో నిర్మించిన ఈ ప్లాంట్ ద్వారా ముడి చమురును శుద్ధి చేసి నేరుగా వంట నూనెను ఉత్పత్తి చేయనున్నారు. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధరతో పాటు, సుమారు 1000 మందికి ఉపాధి లభించనుంది. తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు తీపి కబురు. ఇక నుంచి రాష్ట్రం పామాయిల్ తయారీ కేంద్రంగా మారనుంది. సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆయిల్‌పామ్ రిఫైనరీ ఏర్పాటు చేసి నూనె ఉత్పత్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 2.91 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట, అప్పారావుపేటలలో ఆయిల్‌పామ్ శుద్ధి కర్మాగారాలున్నాయి. కొత్తగా నర్మెటలో రాష్ట్రంలోనే అతిపెద్ద కర్మాగారాన్ని రూ.300 కోట్లతో నిర్మించారు. ఈ నెల 22న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ రిఫైనరీ ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఉన్న రెండు కర్మాగారాల్లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో ముడిచమురు మాత్రమే తీస్తున్నారు. దీనిని మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు మరికొన్ని రాష్ట్రాలకు తీసుకెళ్లి అక్కడి రిఫైనరీలలో నూనెలుగా తయారు చేసి దానిని పామాయిల్‌గా మారుస్తున్నారు. ఆయిల్‌ఫెడ్ కొనుగోలు చేసి విజయ నూనెలుగా మార్కెట్‌లో విక్రయిస్తోంది. రాష్ట్రంలో నూనెల తయారీకి రిఫైనరీ ఏర్పాటు అంశాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నర్మెటలో దాని ఏర్పాటును ప్రతిపాదించగా సీఎం రేవంత్ ఆమోదించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న నర్మెట ఆయిల్‌పామ్ శుద్ధి కర్మాగారం ప్రారంభోత్సవం రోజునే దానిని ఆనుకొని రెండు ఎకరాల స్థలంలో భారీ రిఫైనరీకి శంకుస్థాపన చేయాలని డిసైడ్ అయ్యారు. అనంతరం ఆరు నెలల్లో పూర్తి చేసి పామాయిల్ ఉత్పత్తి ప్రారంభిస్తారు. మలేసియా సాంకేతిక పరిజ్ఞానంతో నర్మెటలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆయిల్‌పామ్ ఫ్యా?క్టరీలో గెలల క్రషింగ్ మొదలుకానుంది. గంటకు 30 టన్నుల సామర్థ్యంతో క్రషింగ్ చేపట్టనున్నారు. దీన్ని దశలవారీగా రోజుకు 120 నుంచి 600 టన్నులకు పెంచే వీలుంది. పరిశ్రమకు అవసరమైన విద్యుత్తును గెలల వ్యర్థాలతోనే ఉత్పత్తి చేసేందుకు గాను నాలుగు మెగావాట్ల ప్లాంటును ఇక్కడే ఏర్పాటు చేశారు. సమీపంలోనే 10 కోట్ల లీటర్ల నీటిని నిల్వచేసే రిజర్వాయరును సైతం నిర్మించారు. నీరు వృథా కాకుండా.. రీసైక్లింగ్ పద్ధతిలో వినియోగించనున్నారు. ఈ రిఫైనరీ ప్రారంభంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 1000 మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రైతులకు సైతం సరైన మద్దతు ధర లభించనుంది.

# గన్ పార్క్ లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల నిరసన

హైదరాబాద్ మార్చి 16,

రైతులకు వెన్నుపోట్లు.. రాహుల్ గాంధీకి వెయ్యి కోట్లు అంటూ అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్క్, అమరవీరుల స్థూపం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసనకు దిగారు. ఆరు గ్యారంటీలపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేసారు.

ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటి గవర్నర్ ప్రసంగంలో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పారు. ఇప్పుడు మూడో గవర్నర్ ప్రసంగం అవుతుంది.. రెండున్నర సంవత్సరాలు గడిచిపోయింది. ఇప్పటికి ఆరు గ్యారంటీలకు చట్టబద్దత కల్పించలేదని అన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు కనీసం బెనిఫిట్స్ ఇవ్వలేని పరిస్థితుల్లో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అంటే దానికి కారణం ఫైనాన్సియల్ మిస్మేనేజ్మెంట్. తెలంగాణను ఒక ఏటీఎం లాగా మార్చి ఏఐసీసీ పెద్దలకు సమర్పించుకునే శ్రద్ధ ఈ రాష్ట్ర ప్రజల మీద లేదు, ఈ శాసనసభలో, శాసనమండలిలో తప్పకుండా ప్రతి పేదవాడి తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు.

తరువాత ఆరు గ్యారంటీలు అమలు చేయాలని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి శాసనసభ, మండలికి హాజరైయారు.

# అత్తాపూర్ లో 500 కోట్ల భూమి స్వాధీనం

హైదరాబాద్, మార్చి 16,

టర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురి కాకుండా హైడ్రా ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇప్పటికే వేల కోట్ల విలువైన భూములను కాపాడి ప్రభుత్వానికి అప్పగించింది. తాజాగా మరో భారీ ఆపరేషన్ చేపట్టింది. నగరంలోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌బాగ్‌లో రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా సిబ్బంది కాపాడారు. 6,427 గజాల ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేయగా.. స్పెషల్ ఆపరేషన్ చేపట్టి ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా భారీ బందోబస్తు మధ్య ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించారు. అనంతరం ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. రెండ్రోజుల క్రితం శేరిలింగంపల్లి మండలం చందానగర్ పరిధిలోని భవానీపురంలో పార్కును హైడ్రా కాపాడింది. తమ కాలనీలోని 400ల గజాల పార్కు స్థలం కబ్జాకు గురవుతోందని భవానీపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు గతంలో పార్కు చుట్టూ ప్రహారీ నిర్మించి హద్దులు నిర్ధారించారన్నారు. ఆ ప్రహరీనే పునాదులుగా చేసి ఇల్లు కట్టడానికి ప్రయత్నిస్తున్నారని వాపోయారు. జీహెచ్ఎంసీ అధికారులతో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. లే ఔట్ ప్రకారం పార్కు స్థలంగా నిర్ధారించుకుంది. మంగళవారం ఈ మేరకు ఆక్రమణలు తొలగించి 400ల గజాల స్థలం చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. దీని విలువ రూ. 2 కోట్ల వరకూ ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. పార్కును కాపాడిన హైడ్రాకు కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు. ఇక ఔఖీూఅ అందిస్తున్న ఉపగ్రహ ఆధారిత డేటా ఊజఆఖీంంకు వజ్రాయుధం లా మారిందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారు అన్నారు. చెరువులు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలకు సంబంధించిన సమాచారం ఒక్కో విధంగా ఉందని.. ఇలాంటి సమయంలో ఎన్ఆర్ఎస్‌సీ డేటా దిక్సూచిలా మారిందన్నారు.

# జిల్లాలో పలువురు తహశీల్దార్ల బదిలీలు.

కడప, మార్చి 16(భారత శక్తి) : పరిపాలనా సౌలభ్యంలో భాగంగా జిల్లా రెవెన్యూ శాఖలో పలువురు తహశీల్దార్లకు బదిలీలు, మరో ఇరువురికి ఇతర నియామకాలను చేపడుతూ జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన తహశీల్దార్ల వివరాలు ఇలా ఉన్నాయి.

1. కడప కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె. విజయ కుమార్.. ప్రొద్దుటూరు తహసీల్దార్ గా బదిలీ.

2. బద్వేలు తహసీల్దార్ డి. ఉదయ భాస్కర్ రాజు పోరుమామిళ్ల తహసీల్దార్ గా బదిలీ.

3. బి.కోడూరు తహసీల్దార్ యు. దస్తగిరయ్య రాజంపేట తహసీల్దార్ గా బదిలీ.

4. కాశినాయున తహశీల్దార్ వి. వెంకటసుబ్బయ్య పులివెందుల O/o RDO DAO గా బదిలీ.

5. చెన్నూరు తహసీల్దార్ శ్రీమతి టి. సరస్వతి కడప ల్యాండ్ రిఫార్మ్స్ స్పెషల్ తహసీల్దార్ గా బదిలీ.

6. పులివెందుల O/o RDO DAO జి. రవీంద్ర రెడ్డి కలసపాడు తహసీల్దార్ గా బదిలీ.

7. సింహాద్రిపురం తహసీల్దార్ కె. వెంకట సైనాథ్ రెడ్డి జమ్మలమడుగు తహసీల్దార్ గా బదిలీ.

8. వేంపల్లి తహసీల్దార్ వై. హరినాథ రెడ్డి రాజుపాలెం తహసీల్దార్ గా బదిలీ.

9. జమ్మలమడుగు తహసీల్దార్ పి. శ్రీనివాస రెడ్డి, కమలాపురం తహసీల్దార్ గా బదిలీ.

10. ఎర్రగుంట్ల తహసీల్దార్ కె. శోభన్ బాబు పెండ్లిమర్రి తహసీల్దార్ గా బదిలీ.

11. ప్రొద్దుటూరు తహసీల్దార్ వి. గంగయ్య కడప కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా బదిలీ.

12. రాజంపేట తహసీల్దార్ శ్రీమతి ఎస్. పీర్ మున్నీ బద్వేల్ తహసీల్దార్ గా బదిలీ.

13. నందలూరు తహసీల్దార్ శ్రీమతి జి. అమరేశ్వరి ఎర్రగుంట్ల తహసీల్దార్ గా బదిలీ.

14. ౧. సుండుపల్లి తహసీల్దార్ శ్రీమతి ఎస్. మహబూబ్ చాంద్ కడప తహసీల్దార్ గా బదిలీ అయ్యారు.

మైలవరం తహసీల్దార్ ఎం. లక్ష్మీనారాయణ, కలసపాడు తహసీల్దార్ శ్రీమతి జి. వి. మధుర వాణి లను తదుపరి కొత్త నియామకాల కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ అదేశించారు.

# రేగొండ మండల నూతన సబ్ ఇన్స్పెక్టర్ ని మర్యాద పూర్వకంగా కలిసిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు.



రేగొండ, మార్చి 16 (భారత శక్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రానికి నూతన సబ్ ఇన్స్పెక్టర్ బాధ్యతలు స్వీకరించిన దాసరి సుధాకర్ గారిని మండల అధ్యక్షులు అంకం రాజేందర్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి వారికీ శుభాకాంక్షలు తెలిపిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, ముఖ్య నాయకులు, సర్పంచ్ లు, గ్రామ శాఖ అధ్యక్షులు, సీనియర్ నాయకులు యూత్, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి ఎస్.వి వ్యవసాయ కళాశాల విద్యార్థులు పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ కార్యక్రమ నిర్వహిణ.



కడప, భారత శక్తి ప్రతినిధి, మార్చి 16: నందిమండలం -- పెండ్లిమర్రి మండల కేంద్రంలోని నందిమండలం గ్రామంలో సోమవారం తిరుపతి ఎస్.వి వ్యవసాయ కళాశాల విద్యార్థులు పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇది గ్రామ ప్రజలతో కలిసి గ్రామ పరిస్థితులు, సమస్యలు, వనరుల గురించి వివరాలను తెలుసుకునే కార్యక్రమం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ కృష్ణ ప్రియ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా భవిష్యత్తులో ప్రజలను ప్రభావితం చేసే వ్యవసాయం ప్రస్తుత పరిస్థితుల గురించి ముఖ్యంగా వివరించారు. బత్తాయి పంటలో మంగు వ్యాధి పూత దశలో ఉన్నప్పుడే మందును పిచికారీ చేయాలని కృష్ణ ప్రియ గారు సూచించారు.

విద్యార్థులు చదువుతో పాటు స్థానికంగా ప్రత్యక్షంగా వ్యవసాయంలో అనుభవం పొందటమే కాకుండా రైతులతో స్నేహభావంతో వ్యవసాయ పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. రైతులు మరియు గ్రామస్తులతో వ్యవసాయంపై చర్చ కార్యక్రమాలు నిర్వహించి వ్యవసాయం పట్ల వారి అనుభవాలను తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్.వి వ్యవసాయ కళాశాల విద్యార్థులు రామాంజినేయులు, ముష్రఫ్ ఖాన్, యాసిన్, చైతన్య, శ్రీ సన్నిధ్, సాయి ఆదిత్య పాల్గొన్నారు.

# ఇరాన్ పై సామ్రాజ్యవాద అమెరికా దాడులను ఖండించండి: సిపిఎం జిల్లా కార్యదర్శి- మల్లు నాగార్జున రెడ్డి పిలుపు



సూర్యాపేట(భారత శక్తి) మార్చి 16:

ఇరాన్ పై సామ్రాజ్యవాద అమెరికా దాడులను తీవ్రంగా ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 18వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విజయ్ కన్వెన్షన్ హాల్లో జరుగు ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దాడులు - దాని పర్యావసానాలు సెమినార్ జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు ముస్లిం మైనారిటీల వద్ద ప్రచారం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో తన ఆధిపత్యాన్ని కొనసాగించడం కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధాలను సృష్టిస్తున్నారని అన్నారు. వెనుజులాలో తమరు ఉత్పత్తిని తన ఆధీనంలో ఉంచుకోవడం కోసం ఆ దేశ అధ్యక్షుడిని అక్రమంగా నిర్బంధించి జైల్లో పెట్టాడని అన్నారు. పాలస్తీనా గాజాలో అనేక దాడులు నిర్వహించి అమాయక ప్రజల ప్రాణాలను బలి తీసుకున్నాడని అన్నారు. ఈ నెల 18 వ తేదీన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం గారి నాలుగో వర్ధంతి సందర్భంగా జరుగు ఈ సెమినార్ కు ముఖ్య అతిథిగా సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బి వి రాఘవులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అన్ని శాఖల కార్యాలయాలు క్రమమైన పద్ధతిలో కొనసాగించుకోవాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి16:

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా"సి" సెక్షన్, జిల్లా కోశాధికారి కార్యాలయం, జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, ఎన్ఐసి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కార్యాలయం, జిల్లా పంచాయతీ అధికారి, హౌసింగ్ కార్యాలయం, తదితర ప్రభుత్వ కార్యాలయా లను సోమవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యాలయాలు పరిశుభ్రంగా ఉన్నాయా అని పరిశీలించారు. ఫైల్స్, పిఆర్ రిజిస్టర్,హాజరు పట్టికను పరిశీలించి అన్ని సక్రమంగా ఉన్నాయో లేదో అని తనిఖీ చేశారు, అన్ని కార్యాలయాల ఫైల్స్ సక్రమంగా క్రమ పద్ధతిలో ఉండాలని, కార్యాలయాలు పరిశుభ్రంగా ఎలాంటి చెత్తాచెదారం లేకుండా ఉండాలని,హాజరు,పి ఆర్ రిజిస్టర్లు,కార్యాలయాల ఫైల్స్ సక్రమంగా నిర్వహించాలని ప్రతి కార్యాలయు సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట ఏవో సుదర్శన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శిలలను సైతం కరిగించగల శక్తి సంగీతానిధి

## -అలాంటి సంగీతాన్ని అందించడంలో సుధాబ్యాంక్ ముందుంటుంది.

## -త్యాగ శ్యామ దీక్షిత ఆరాధనలో సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్




సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 16:

శిలలను సైతం కరిగించగల శక్తి సంగీతానికి ఉందని అలాంటి సంగీతాన్ని ప్రోత్సహించడంలో సంగీత ప్రియులకు అందించడంలో సుధా బ్యాంక్ ఎల్లప్పుడు ముందుంటుందని సుధా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక సుధా బ్యాంకు ఆడిటోరియంలో కర్ణాటక సంగీత త్రాయం ఆరాధన ఉత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ ప్రముఖ గాయకులు ఎన్నో జాతీయ అంతర్జాతీయ వేదికలపై తన గానాన్ని వినిపించిన ప్రపంచ ప్రఖ్యాత గాయకులు మోదుమూరి సుధాకర్ త్యాగ శ్యామ దీక్షిత ఆరాధన ఉత్సవంలో గానం చేయడం మనందరి అదృష్టం అన్నారు. సుధా బ్యాంకు సంగీతాన్ని సాహితి ప్రియులను గుర్తించి గౌరవించడంలో వారి ప్రతిభను వెలికి తీయడంలో ఎప్పుడు ముందుంటుందన్నారు. సుధా బ్యాంక్ వార్షికోత్సవ సందర్భంగా ప్రతి సంవత్సరం త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను ఆనవాయితీగా నిర్వహిస్తు శాస్త్రీయ సంగీత గొప్పతనాన్ని గుర్తు చేస్తుందన్నారు. కర్ణాటక సంగీత త్రయం ఆరాధనోత్సవం లో భాగంగా త్యాగ శ్యామ దీక్షిత ఆరాధన ఉత్సవాన్ని ప్రముఖ సంగీత విద్వాంసులు ఎన్సీఆర్ సంగీత పరిషత్ ఎన్.సి.ఆర్.రంగాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆరాధన ఉత్సవాన్ని సూర్యాపేట సంగీత ప్రియులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రముఖ సంగీత విద్వంసులు ఎన్సీ రంగాచార్యులు, గాయకులు మోదుమూరి సుధాకర్, ఎన్ . వయోలిన్ న్ సి.మాధవ, మృదంగం అరవింద్ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జె.శశిధర్, డీఎస్వి శర్మ, కక్కిరేణి చంద్ర శేఖర్, తోట శ్యాం ప్రసాద్ బోనగిరి భాస్కర్ ,ఏపూరి శ్రవణ్ కుమార్, శర్మ ,కొత్త మల్లికార్జున్ మేనేజర్లు రవీందర్ రెడ్డి,సైదులు, అంజన్ ప్రసాద్,వెంకటేశ్వర్లు, మధు,అంజన,గుండా ఉపేందర్,విద్యాసాగర్ ,కృష్ణ,పాటు పెద్ద ఎత్తున సంగీత ప్రియులు, అభిమానులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# బోజడ్ల సత్యవతికి ఘన నివాళి.

## -నివాళులర్పించిన టిడిపి పార్లమెంటరీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, మార్చి 16: ఖమ్మం జిల్లా బోనకల్ మండల పరిధిలోని మోటమర్రి గ్రామానికి చెందిన బోజడ్ల సత్యవతి ఇటీవల మృతి చెందగా సోమవారం దశదిన కర్మ సందర్భంగా వారి చిత్రపటానికి ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రామనాథం మాట్లాడుతూ సత్యవతి పార్టీకి తీరని లోటన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నివాళులర్పించిన వారిలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ, జిల్లా నాయకులు భాగం రమేష్ భోజడ్ల అప్పారావు, మైనేని రవికుమార్,తూము పురుషోత్తం రావు , ఎస్ కే బాజీ షరీఫ్, గ్రామ నాయకులు ఎస్కే కాసిం సాహెబ్, కన్నీపోగు రవీంద్ర, బాబురావు,బెజ్జం రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

# రైతులు లాభసాటి పంటలు సాగు చేయాలి



భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, 16 మార్చి (భారత శక్తి ): రైతులు ఉద్యాన పంటల సాగు ద్వారా దీర్ఘకాలిక లాభాలతో పాటు మంచి ఆర్థిక ఆదాయం పొందే అవకాశం ఉందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఏ. సునీల్ కుమార్ తెలిపారు.

సోమవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో చిట్యాల మండలం, గుంటూరుపల్లి గ్రామంలో రైతులకు ఉద్యాన పంటల సాగుపై అవగాహన మరియు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యాన పంటలు సాగు చేయడం ద్వారా తక్కువ భూమిలోనే ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. మార్కెట్‌లో మంచి ధర లభించడం తో పాటు నీటి వినియోగం తక్కువగా ఉండటం వలన రైతుల ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపారు. పండ్ల తోటలు మరియు కూరగాయల పంటలు రైతులకు నిరంతర ఆదాయాన్ని అందిస్తాయని చెప్పారు. ఉద్యాన పంటల సాగులో చేపట్టాల్సిన వివిధ యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు.

ఉద్యాన శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల గురించి కూడా రైతులకు క్లుప్తంగా వివరించారు. ముఖ్యంగా సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి పథకం, ఆయిల్ పామ్ పథకం, ఉద్యాన మిషన్ వంటి పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు.

మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి యూరియా యాప్ వినియోగంపై రైతులకు విపులంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న డ్రిప్ కంపెనీ ప్రతినిధులు కుమార్ మరియు పరీక్షిత్ డ్రిప్ సాగు విధానం, దాని వినియోగం మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి రామాచారి, ఆయిల్ పామ్ ప్రతినిధులు సాయి, ప్రీతం, గవాస్కర్, పరిపూర్ కంపెనీ ప్రతినిధి పూర్ణచందర్, కుమార్ డ్రిప్ కంపెనీ ప్రతినిధి సమ్మయ్య, రైతులు కొంక హనుమంతరావు, పువ్వాటి సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మోహన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం భాజపా నాయకులు వి. సత్యనారాయణ గౌడ్.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 16 నిర్మల్ పట్టణంలోని సోమవార్‌పేటకు చెందిన కటిక మోహన్ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన కుటుంబ సభ్యులను నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షులు, భాజపా నాయకులు వి.సత్యనారాయణ గౌడ్ పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మోహన్ సోదరుడు, తెలంగాణ ఉద్యమ కారుడు కటిక శివాజీ ను ధైర్యం చెప్పారు. మోహన్ మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో సారంగపూర్ మండలం ధని గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్ భారతీయ జనతా పార్టీ నాయకుడు వడ్డే రాజేందర్ రెడ్డి, పార్టీ నాయకుడు ఒడిశల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధికి జనగణన అత్యంత కీలకం

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 16(భారత శక్తి ) దేశాభివృద్ధికి జనగణన అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ అభిలాష అన్నారు. భారత జనాభా గణన - 2027 కి సంబంధించి, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోమవారం అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో జనగణన ప్రక్రియ కీలక భూమిక పోషిస్తుందని అన్నారు. అధికారులు చేపట్టే జనగణన ఆధారంగానే ప్రభుత్వం ప్రజలకు అవసరమయ్యే పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర ప్రజా ప్రయోజనాల రూపకల్పనలో జనగణన ప్రక్రియ ఆధారం అని అన్నారు. దేశాభివృద్ధికి దిక్సూచిలా నిలిచే జనాభా గణన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జనగణన ప్రక్రియకు సంబంధించి, గృహాల గుర్తింపు, జనగణన వివరాల నమోదులో తప్పులకు తావు ఉండకూడదని పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్లు అందించే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని వివరించారు. ఎటువంటి సందేహాలు ఉన్నా మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. జనగణన ప్రక్రియను బాధ్యతగా నిర్వర్తించి, విజయవంతం చేయాలన్నారు.

మాస్టర్ ట్రైనర్లు అధికారులకు జనగణనకు సంబంధించి అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, సీపీఓ జీవరత్నం, డిపివో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో శంకర్,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సమస్య పరిష్కారం కోరుతూ ప్రజలు ప్రజావాణిలో దరఖాస్తు చేయాలి.



భూపాలపల్లి జిల్లా, మార్చి16 (భారత శక్తి): అందచేసిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు.

సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి మొత్తం 52 దరఖాస్తులు స్వీకరించి తక్షణ చర్యలకు సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. అట్టి దరఖాస్తులను అధికారులు జాప్యం చేయక పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన అన్ని దరఖాస్తులు వచ్చే సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు ఇస్తున్నారని, అందువల్ల అధికారులు దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో పర్యవేక్షణ లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థలు ఆదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు అధ్యక్షతన నిర్వహించిన బిజేఎల్ పి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 16: ప్రారంభం అయ్యే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అమలు పరచాల్సిన వ్యూహాల గురించి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన నిర్వహించిన బిజేఎల్ పి సమావేశంలో తోటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కామారెడ్డి శాసన సభ్యులు, బిజేఎల్ పి ఉపనేత కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమంలో 114 దరఖాస్తులు స్వీకరించిన లోకల్ బాడి అదనపు కలెక్టర్ మధుమోహన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 16: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని 25వ నంబర్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో లోకల్ బాడీ అదనపు కలెక్టర్ మధుమోహన్ పాల్గొని దరఖాస్తుదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన దరఖాస్తుదారుల నుండి వచ్చిన వినతి పత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు.

ప్రజల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. శాఖల వారీగా దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితంగ పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు 114 వచ్చాయని అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో సీఈఓ చందర్, ఏఓ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# 40 ఏళ్ల హిట్ సాంగ్.. ఇప్పుడు 50 వేల డాలర్లు



అది దాదాపు 40 ఏళ్ల క్రితం నాటి ఆల్బమ్. శ్రోతలను ఓ ఊపు ఊపింది. విడుదలైన అన్ని మాధ్యమాల్లోనూ సత్తా చాటింది. ఇప్పటికీ మార్మోగుతూనే ఉంది. అదే 'హవా హవా హే హవా'. ఓ సినిమాలో ఈ పాటను వినియోగించడం వల్ల తాను 50 వేల డాలర్లు (రూ.46 లక్షలకు పైగా) అందుకున్నానని పాక్ పాప్ సింగర్ హసన్ జహంగీర్ తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన ఆ సినిమా పేరును ప్రస్తావించలేదు గానీ.. రూ.1000+ కోట్లు వసూలుచేసిన రీసెంట్ మూవీ అని చెప్పడం గమనార్హం. సదరు చిత్రబృందం పాటను వాడుకునేందుకు తన అనుమతి తీసుకొని, అంత మొత్తం చెల్లించిందని పేర్కొన్నారు. ఈ సాంగ్ విషయంలో తనకు క్రెడిట్ ఇచ్చారని చెప్పారు. అప్పట్లో కాపీరైట్ వ్యవస్థ అంత పటిష్టంగా లేదని, ప్రస్తుతం తన పాటను వాడుకోవాలనుకున్న వారు ముందుగానే పర్మిషన్ తీసుకుని డబ్బు ఇస్తున్నారని తెలిపారు. 'హవా హవా'ను 1986లో స్వరపరిచానని, 1987లో అది విడుదలైందని గుర్తుచేసుకున్నారు. గతంలో.. బాలీవుడ్ సినిమా 'ఇన్సాఫ్ అప్నే లహూ సే'లోనూ ఈ పాటను వాడారు. జహంగీర్ చెప్పిన దాని ప్రకారం.. ఆ రీసెంట్ హిట్ మూవీ 'ధురంధర్'. ఇందులో ఎస్పీ చౌదరి అస్లామ్‌గా సంజయ్‌దత్ ఎంట్రీ సీన్ బ్యాక్‌గ్రౌండ్‌లో ఇదే సాంగ్ వినిపిస్తుంది. ఎడారిలో సంజయ్ దత్ విలన్లతో పోరాటం చేసే క్రమంలో వచ్చే ఈ రెట్రో ట్రాక్ ప్రేక్షకులకు మంచి అనుభూతి పంచింది. రణ్‌వీర్ సింగ్ హీరోగా ఆదిత్యధర్ తెరకెక్కించిన ఈ సినిమా రూ.1300+ కోట్ల కలెక్షన్లతో రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. దీని సీక్వెల్ 'ధురంధర్ 2' ఈనెల 19న రిలీజ్ అవుతుంది. 18న సాయంత్రం ప్రీమియర్స్ ప్రదర్శితం కానున్నాయి.

## సినిమా

## ఆస్కార్ నివాళుల జాబితాలో కోట శ్రీనివాసరావు.. ధర్మేంద్ర




అద్భుతమైన నటనతో కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకొని.. గతేడాదిలో తుదిశ్వాస విడిచిన నటీనటులకు ఆస్కార్ నివాళులర్పించింది. లాస్ ఏంజెలెస్‌లో జరిగిన 98వ ఆస్కార్ అవార్డుల వేడుకలో 'In Memoriam' సెగ్మెంట్‌లో ప్రపంచవ్యాప్తంగా సినీరంగం కోసం కృషి చేసిన గొప్ప కళాకారులను స్మరించుకున్నారు (Oscars). ఈ సందర్భంగా హాలీవుడ్ ప్రముఖులతో పాటు భారతీయ సినిమా నుంచి ధర్మేంద్ర, మనోజ్ కుమార్, బి.సరోజాదేవి, కోట శ్రీనివాసరావు వంటి దిగ్గజాల పేర్లను అకాడమీ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా పొందుపరిచింది. ఆస్కార్ వేడుక ప్రారంభంలో గతేడాది మరణించిన హాలీవుడ్ ప్రముఖులకు నివాళులర్పిస్తూ వీడియోను ప్రదర్శించారు. వారిని స్మరించుకుంటూ వారితో ఉన్న జ్ఞాపకాల గురించి కొందరు వేదికపై మాట్లాడారు. అయితే, ఆ వీడియోలో ధర్మేంద్రను చూపించకపోవడంతో అభిమానులు అసహనం వ్యక్తంచేస్తూ ఎక్స్ వేదికగా పోస్టులు పెట్టారు. సమయాభావం వల్ల వీడియోలో కొందరినే చూపారని.. ఆ తర్వాత అందరి పేర్లను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారని హాలీవుడ్ మీడియా పేర్కొంది. 89 ఏళ్ల వయసులో గతేడాది నవంబర్ 24న ధర్మేంద్ర తుదిశ్వాస విడిచారు. సినీ పరిశ్రమకు ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్రం పద్మ విభూషణ్‌తో సత్కరించింది. ఇక 40 ఏళ్ల సుదీర్ఘ సినీ కెరీర్ కలిగిన కోట శ్రీనివాసరావు గతేడాది జులై 13న మరణించిన విషయం తెలిసిందే.

## సల్మాన్ 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' పేరు మార్పు.. కారణమేంటో?



బాలీవుడ్ అగ్ర నటుడు సల్మాన్‌ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. తాజాగా ఈ సినిమా పేరు మారుస్తూ అనూహ్య ప్రకటన వెలువడటం చర్చనీయాంశమైంది. 'మాతృభూమి' పేరుతో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ మేరకు కొత్త పేరుతో ఉన్న పోస్టర్‌ను సల్మాన్ ఖాన్ తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. అయితే పేరు మార్పునకు గల కారణాలను వెల్లడించలేదు. దాదాపు ఆరేళ్ల క్రితం జరిగిన గల్వాన్ ఘర్షణల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో సల్మాన్ ఖాన్.. కర్నల్ సంతోష్‌బాబుగా నటిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాకు అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రాంగద సింగ్ కథానాయిక. గతేడాది డిసెంబరులో సల్మాన్ పుట్టినరోజును పురస్కరించుకొని ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేయగా.. ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ లభించింది. అయితే, నాడు దీనిపై చైనా అధికారిక మీడియా అక్కసు వెళ్లగక్కింది. చైనాపై వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు చరిత్రను వక్రీకరిస్తున్నారంటూ నోరు పారేసుకుంది. ఈ చిత్రం జాతీయవాద మెలోడ్రామా అని చైనా ఆరోపించింది. ఈ పరిణామాల వేళ తాజాగా సినిమా పేరును మార్చడం గమనార్హం. వాస్తవానికి ఈ చిత్రాన్ని ఏప్రిల్ 17న విడుదల చేయనున్నట్లు తొలుత వార్తలు వచ్చాయి. ఇప్పుడు పేరు మార్పుతో దీని విడుదల మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఆగస్టులో దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు సమాచారం.

## ఈషా అంబానీ ఆస్కార్ ఎంట్రీ.. ఫొటో వైరల్



సినీ రంగ ప్రతిష్టాత్మక వేడుక 'ఆస్కార్ 2026' అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ తనయ ఈషా అంబానీ సందడి చేశారు. వింటేజ్ వాలెంటినో గౌన్‌లో రెడ్ కార్పెట్‌పై మెరిశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. తన భర్త ఆనంద్ పిరమాల్‌తో కలిసి ఈషా అంబానీ ఆస్కార్ వేడుకకు హాజరయ్యారు. ప్రముఖ ఇటలీ డిజైనర్ వాలెంటినో ఫాల్/వింటర్ 2006-2007 కలెక్షన్ గౌను, చోకర్ స్టైల్ డైమెండ్ నెక్లెస్‌లో ఈషా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ఈవెంట్‌కు ముందు ఈషా అంబానీ అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఈ మ్యూజియంతో నీతా ముకేశ్ అంబానీ కల్చర్ సెంటర్ (NMACC) కలిసి పనిచేసే అంశాన్ని ఆమె చర్చించినట్లు సమాచారం. భారతీయ సంస్కృతిని అంతర్జాతీయ వేదికపై ప్రతిబింబించడంతో పాటు ఇండియన్ సినిమాకు మరింత గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ఈషా అంబానీ ఈ వేడుకలో పాల్గొన్నారు.

## నేను కార్తీ ఫ్యాన్!



సూపర్ అనే హిందీ సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన భామ కృతి శెట్టి. ఆ తర్వాత తెలుగులో ఈ అమ్మడు నటించిన ఉప్పెన సూపర్ హిట్‌గా నిలిచింది. ఇటీవల ఆమె మలయాళ చిత్రం 'ఏఆర్ఎమ్'లో కనిపించిందీ అమ్మడు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న తమిళ చిత్రాల్లో ఒకటి 'వా వాతియార్'. ఇందులో ఆమెకు జోడీగా నటుడు కార్తీ నటిస్తోంది. దర్శకుడు నలన్ కుమారస్వామి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ప్రచార కార్యక్రమంలో కృతి శెట్టి ఒక ఆసక్తికరమైన విషయం వెల్లడించారు. చిన్నప్పటి నుంచే కార్తీకి తాను అభిమానినని చెప్పారు. ముఖ్యంగా ఆయన నటించిన 'పయ్యా' చిత్రాన్ని చిన్నప్పుడు ఎన్నోసార్లు చూసినట్లు తెలిపారు. బెంగళూరులో ఉన్న అమ్మమ్మ ఇంటికి వెళ్లినప్పుడు విసుగుగా అనిపిస్తే అదే సినిమాను మళ్లీ మళ్లీ చూసేదాన్నని చెప్పారు. కథ పూర్తిగా అర్థం కాకపోయినా కార్తీ, తమన్నా నటన తనను ఆకట్టుకుందంటోంది. సోషల్ మీడియాలోనూ యాక్టీవ్ గా ఉంటున్న ఈ భామ కొన్ని ఫొటోలును షేర్ చేసింది. వాటిని చూసిన అభిమానులు ఫిదా అవుతున్నారు. లైక్ లు కామెంట్లతో తమ అభిమానాన్ని చాటుతున్నారు. బ్లాక్ డ్రెస్ లో మెరిసిపోతోంది బేబమ్మ. ఈ షూట్‌లో ఆమె ధరించిన దుస్తులను ప్రముఖ డిజైనర్లు రోహిత్ గాంధీ, రాహుల్ ఖన్నా రూపొందించారు.



## పార్థిబన్ కుమార్తెతో త్రిష

నటి త్రిషా కృష్ణన్ ఇటీవల చెన్నైలో జరిగిన ఒక వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో నటుడు-దర్శకుడు పార్థిబన్ కుమార్తె, మాజీ బాలనటి కీర్తనతో కలిసి ఫోటోలు దిగారు. ఆ ఫొటోలను త్రిషా తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. పలువురు అతిథులతో కలిసి తీసుకున్న సెల్ఫీల్లో కూడా త్రిషా, కీర్తన కనిపించారు. ఇటీవల చెన్నైలో జరిగిన మరో వివాహ వేడుకలో త్రిషా నటుడు, రాజకీయ నాయకుడు విజయ్‌తో కలిసి కనిపించడం పెద్ద చర్చకు దారి తీసింది. ఇద్దరి మధ్య సంబంధంపై సామాజిక మాధ్యమాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో పార్థిబన్ చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. ఇటీవల జరిగిన ఒక సినీ అవార్డు కార్యక్రమంలో త్రిషా పోషించిన 'కుందవై' పాత్రను ప్రస్తావిస్తూ పార్థిబన్ చేసిన సరదా వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారి తీశాయి. దీనిపై త్రిష సీరియస్ గా స్పందించిన విషయం తెలిసిందే. అదే తరుణంలో పార్థిబన్ సారీ కూడా చెప్పారు.

## వాట్ ఏ షర్ట్



ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రానికి సంబంధించిన ప్రీ రిలీజ్ వేడుకలో సినిమా విశేషాల కంటే ఎక్కువగా దర్శకుడు హరీష్ శంకర్ ధరించిన ప్రత్యేక చొక్కా అందరి దృష్టిని ఆకర్షించింది. నల్లటి చొక్కాపై పవన్ కళ్యాణ్ ఐకానిక్ మేనరిజమ్స్‌తో పాటు గబ్బర్ సింగ్, ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాలకు సంబంధించిన మాస్ పోస్టర్లు కళాత్మకంగా ముద్రించారు. చొక్కా వెనుక భాగంలో పవన్ కల్యాణ్ ఫోటోతో పాటు సినిమాల్లోని పవర్‌ఫుల్ డైలాగులను గుర్తు చేసే గ్రాఫిక్స్ ఉండటంతో అది ఈవెంట్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దర్శకుడు హరీష్ శంకర్ తన ఫ్యాషన్ ద్వారా పవర్ స్టార్‌పై ఉన్న అభిమానాన్ని చూపించారని అభిమానులు సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేస్తున్నారు. మరోవైపు పవన్ కల్యాణ్ మాత్రం తనదైన నిరాడంబరతతో సాధారణ వైట్ కుర్తాలో వేడుకకు హాజరయ్యారు. అభిమానులతో ఆప్యాయంగా మెలగడం మరోసారి ఆకట్టుకుంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రాన్ని మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించింది. దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఇండో-యూఎస్ ట్రేడ్ డీల్‌పై యువజన కాంగ్రెస్ సమరభేరి

* **ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన.. ప్రధాని మోదీ నిర్ణయంపై ధ్వజం**
* **ఢిల్లీలో యువజన బృందంతో**
* **తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంత్ రెడ్డి**






న్యూఢిల్లీ, మార్చి 16: భారత శక్తి : భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాతో కుదుర్చుకున్న నూతన వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ జాతీయ యువజన కాంగ్రెస్ పిలుపు మేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన కార్యక్రమం జరిగింది. జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ ఆదేశాల మేరకు తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ యువజన అధ్యక్షులతో యువజన నాయకులతో పెద్ద ఎత్తున ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

* **అదానీ కేసుల వేళ.. ఈ ఒప్పందం వెనుక మర్మమేంటి?**

ఈ సందర్భంగా శివంత్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అమెరికాలోని న్యూయార్క్ ఫెడరల్ కోర్టులో వ్యాపారవేత్త గౌతమ్ అదానీపై విచారణ వేగవంతమైన తరుణంలోనే ఈ ఒప్పందం కుదరడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఒకవైపు అంతర్జాతీయంగా 'ఎప్స్టీన్ ఫైల్స్' సంచలనం సృష్టిస్తున్న వేళ, కేంద్రం హడావుడిగా ఈ ఒప్పందాన్ని ఎందుకు కుదుర్చుకుందని ఆయన ప్రశ్నించారు.

* **రైతులకు గొడ్డలి పెట్టు.. ఇంధన భద్రతకు ముప్పు**

ఈ వాణిజ్య ఒప్పందం వల్ల దేశీయ వ్యవసాయ రంగానికి జరిగే నష్టాన్ని ఆయన ఈ సందర్భంగా వివరించారు. వ్యవసాయ రంగంపై ప్రభావం: అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్లను బార్లా తెరవడం వల్ల దేశంలోని కోట్లాది మంది రైతుల జీవనోపాధి ప్రమాదంలో పడుతుంది. 60 శాతం మందికి ఉపాధినిచ్చే వ్యవసాయ రంగాన్ని కేంద్రం పణంగా పెడుతోందని మండిపడ్డారు. ఇంధన సంక్షోభం: రష్యా, ఇరాన్ వంటి దేశాల నుంచి తక్కువ ధరకే చమురు పొందే అవకాశాలను ఈ ఒప్పందం దెబ్బతీసేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై భారంగా మారుతుందని హెచ్చరించారు. సుంకాల అసమానత: అమెరికా ఉత్పత్తులు భారత్‌లోకి సున్నా సుంకాలతో ప్రవేశిస్తుంటే, భారత ఉత్పత్తులపై అమెరికా మాత్రం అధిక సుంకాలు విధించడం అన్యాయమని, ఇది ఏకపక్ష ఒప్పందమని పేర్కొన్నారు.

**పోరాటం ఆగదు..**

కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ ప్రజా వ్యతిరేక ఒప్పందాన్ని పునఃసమీక్షించాలని, లేనిపక్షంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



# శాంతి సోదర భావానికి ప్రతీక... రంజాన్ పర్వదినం

* **పేదల సంక్షేమానికి.... ప్రభుత్వం పెద్ద పీట.**
* **మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు... తోటకూర వజ్రేష్ యాదవ్.**



జవహర్ నగర్ మార్చి 16 (భారత్ శక్తి): శాంతి సోదర భావం సౌభ్రాతృత్వానికి ప్రతీక రంజాన్ పర్వదినం అని, సేవా నిరతికి, పరోపకారానికి రంజాన్ మాసం ఉన్నతమైనదని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ నైస్ గార్డెన్ లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముస్లిం సోదరులకు" రంజాన్ తోఫా" పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తుందని సర్వ మానవ శ్రేయస్సుయే రంజాన్ పర్వదిన సందేశమని రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదరులకు రంజాన్ కానుక గా తోఫా కార్యక్రమం నిర్వహించడం ముదాబావమన్నారు. రంజాన్ పర్వదినం శాంతి సోదర భావానికి సేవాభావానికి ప్రతీక అని ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉండి సంక్షేమంలో భారతదేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ముందు వరుసలో నిలబడడం సంతోషమన్నారు. అనంతరం ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ కానుకలు అందించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, సీనియర్ నాయకులు కల్లేపల్లి సదానంద్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, వేణు, సతీష్ గౌడ్, మహమ్మద్ ఫారూఖ్, పాషా మియా, కాలేశా, యూసుఫ్ పఠాన్, ఉమర్, అనంతలక్ష్మి, చింత విజయ, సునీత, రజిత గోపాల్, లత, సునీత, ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జ్యోతి బాపులే గురుకులాన్ని టాప్ లో ఉంచండి

* **అత్యుత్తమ విద్య బోధనకు కేరాఫ్ గా అడ్రస్ కావాలి**
* **గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్ ప్రతినిధి, మార్చి 16(భారత శక్తి): అత్యుత్తమ విద్యా బోధనకు కేరాఫ్ అడ్రస్ గా మహాత్మ జ్యోతిబాపూలే గురుకులాన్ని తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు సూచించారు. అత్యుత్తమ విద్యను బోధించాలని మంచి ఫలితాలు సాధించి గురుకులాన్ని టాప్ లో నిలబెట్టాలని పేర్కొన్నారు. తిమ్మాపూర్ లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాల జిల్లా కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, మెనూ ప్రకారం టిఫిన్ లంచ్ పెడుతున్నారా, విద్యాబోధన ఎలా ఉంది, వసతులు సౌకర్యాలు అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని బాగున్నాయని విద్యార్థులకు సమాధానం ఇచ్చారు. అనంతరం స్టాఫ్ రూము, వాష్రూమ్స్ వంటగది స్టోర్ రూమ్ డార్మెటరీ గదులను పరిశీలించారు. స్టోర్ రూమ్ లో బియ్యము పప్పులు ఇతర సామాగ్రిని పర్యవేక్షించారు. సామాగ్రికి సంబంధించిన ఎక్స్పైరీ డేట్ ను తరచు చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అత్యుత్తమ విద్యను బోధించాలని మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా గురుకులంలో చేపట్టిన మోడ్రన్ కిచెన్ ఆధునికరణ పరులను పరిశీలించారు. గురుకులంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని వసతుల కల్పన మెనూ ప్రకారం భోజనం కల్పించే విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణ జరపాలని సూచించారు. గురుకులంలో ఏమైనా పెండింగ్ పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. శానిటేషన్ సమస్త తలెత్తకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. గురుకులంలో కోతుల బెడద ఉందని వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ జిల్లా కలెక్టర్ ను కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ కోతుల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గురుకులం అభివృద్ధి, విద్యా బోధన ఇతర అంశాలపై అంశాలపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.

# ప్లాట్ కొంటున్నారా.. మీ డబ్బు గాలిలో కలవకముందే జాగ్రత్త!

హైదరాబాద్, మార్చి 16 (భారత శక్తి) : హైదరాబాద్‌లో ఇల్లు లేదా ప్లాట్ కొనాలనుకుంటున్నారా? అయితే, బిల్డర్ల మాటలు నమ్మి మోసపోకండి. అన్నీ సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్నాకే అడుగు ముందుకు వేయాలని హైడ్రా (HYDRAA) తీవ్రంగా హెచ్చరించింది. ప్రజావాణిలో వస్తున్న వరుస ఫిర్యాదుల నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండా ప్లాట్లు కొనవద్దని ప్రజలకు సూచించింది.



**ఏం చూడాలి?**

చెరువుల ముప్పు: కొనే ప్లాట్ చెరువు ఎఫ్‌టీఎల్ (FTL) పరిధిలో ఉందేమో గూగుల్ మ్యాప్స్‌లో చెక్ చేసుకోండి.

* అనుమతులు: హెచ్ఎండీఏ లేఅవుట్ అనుమతులు ఉన్నాయా? లేదా? అనేది ఆన్‌లైన్‌లో వెరిఫై చేసుకోండి.
* దారి సౌకర్యం: గేటెడ్ కమ్యూనిటీల పేరుతో అమ్ముతున్నారు.. కానీ బయటి కాలనీలకు కనీసం 40 అడుగుల రోడ్డు ఉందో లేదో చూడండి.
* నకిలీ నంబర్లు: కేవలం ఇంటి నంబర్లు, బై నంబర్లతో అమ్మే ప్లాట్ల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండండి.

**ప్రజావాణిలో బయటపడ్డ అక్రమాలు**

* సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 48 ఫిర్యాదులు అందాయి. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వీటిని క్షుణ్ణంగా పరిశీలించారు. శాటిలైట్ మ్యాప్స్ ద్వారా స్థలాలను చూసి, ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**ప్రధానాంశాలు:**

* పటాన్‌చెరు అరాచకం: 92 ఎకరాల లేఅవుట్‌లో 32 ఎకరాల భూమి వివాదంలో ఉంది. భూమి అమ్మిన పాత రైతులు, స్థానిక నేతల అండతో మళ్ళీ నకిలీ పాస్ పుస్తకాలు సృష్టించి అమ్ముతున్నారు.
* చెరువుల్లో కాలుష్యం: బాచుపల్లి చెరువులోకి మురుగునీరు వచ్చి చేరుతోంది. చెరువును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరారు.
* ముంపు కష్టాలు: అమీన్‌పూర్ చెరువులో లేఅవుట్లు మునిగిపోతున్నాయని, నివాసయోగ్యం కాకుండా మారిందని సెక్రటేరియట్ ఎంప్లాయీస్ సొసైటీ వాపోయింది.
* కబ్జా పర్వం: కాప్రా, బాలానగర్‌లలో పార్కు స్థలాలను కబ్జా చేసి గుడులు కట్టడం, షెడ్లు వేయడంపై బాధితులు హైడ్రాను ఆశ్రయించారు.

ప్రజల ఆస్తులను కాపాడేందుకు తాము కఠినంగా వ్యవహరిస్తామని, అక్రమాలకు పాల్పడే వారిపై ఉపేక్షించేది లేదని హైడ్రా స్పష్టం చేసింది.

# పోలీసు సిబ్బందికి ఉచిత మెగా వైద్య శిబిరం

ఎల్బీనగర్, మార్చి 16 (భారత శక్తి ) : మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలోని పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సోమవారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఒమేగా, ఫోర్ట్ డెంటల్, డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు.



**నిర్వహించిన పరీక్షలు:**

శిబిరంలో సిబ్బందికి లిపిడ్ ప్రొఫైల్, బీఎండీ (ఎముకల సాంద్రత), రక్తపోటు (బీపీ), షుగర్ (ఆర్‌బీఎస్), ఈసీజీ, 2డీఎకో పరీక్షలు చేశారు. ప్రత్యేకించి 45 ఏళ్లు పైబడిన పురుషులకు పీఎస్ఏ, 40 ఏళ్లు పైబడిన మహిళలకు పాప్ స్మియర్, మేమోగ్రామ్ వంటి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఫోర్ట్ డెంటల్ వైద్యులు దంత పరీక్షలు, అగర్వాల్ ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నిరంతరం విధుల్లో నిమగ్నమయ్యే పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ముందస్తు పరీక్షల ద్వారా వ్యాధులను గుర్తించి చికిత్స పొందవచ్చని సూచించారు. ముఖ్యంగా మహిళా సిబ్బంది క్యాన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ వైద్య శిబిరం మంగళవారం కూడా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) ఇందిరా, యూనిట్ వైద్యులు సరిత, అచ్యుతరావు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

**-సత్వర పరిష్కారానికి ఆదేశం**

**-జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా**



కరీంనగర్ ప్రతినిధి, మార్చి 16 (భారత శక్తి): సమస్యల పరిష్కారం కోసం ఎంతో దూరం నుంచి ప్రజావాణికి వచ్చి విన్నవించే బాధితులకు అధికారులు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి టాప్ ప్రయారిటీ ఇవ్వాలని సూచించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ వినతి పత్రాలను స్వీకరించారు. బాధితులు చెప్పిన సమస్యలను ఆలకించారు.. వెంటనే పరిష్కారం అయ్యే దరఖాస్తులపై సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమయం తీసుకునే దరఖాస్తులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. దరఖాస్తులను ఓపిగ్గా పరిశీలిస్తూ సమస్యలు ఆలకిస్తూ బాధితుల్లో జిల్లా కలెక్టర్ భరోసా నింపారు. వృద్ధులు దివ్యాంగుల వద్దకే కలెక్టర్ స్వయంగా వెళ్లి దరఖాస్తులను స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై 290 దరఖాస్తులు వచ్చాయి. ఇటీవల బాధ్యతలు తీసుకున్న జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని సరికొత్తగా నిర్వహిస్తున్నారు.

## ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పన

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 16(భారత శక్తి) బైంసా పట్టణంలోని జిపిఎల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు, సింగిల్ యూసేజీ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ శాస్త్రవేత్త బి. తిరుపతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడటం వల్ల ప్రజల్లో ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, సింగిల్ యూసేజీ ప్లాస్టిక్ నిషేధం లో ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయ మార్గాలను ఆయన విద్యార్థులకు వివరించారు. సి.పి.సి.బి (CPCB) రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన బయోడిగ్రేడబుల్ (జీవ విచ్ఛిన్నం చెందే) సంచుల వివరాలను విద్యార్థులకు వివరించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# శాంతి సోదర భావానికి ప్రతీక... రంజాన్ పర్వదినం

* **పేదల సంక్షేమానికి.... ప్రభుత్వం పెద్ద పీట**
* **మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు... తోటకూర వజ్రేష్ యాదవ్.**





జవహర్ నగర్ మార్చి 16 (భారత్ శక్తి ): శాంతి సోదర భావం సౌభ్రాతృత్వానికి ప్రతీక రంజాన్ పర్వదినం అని, సేవా నిరతికి, పరోపకారానికి రంజాన్ మాసం ఉన్నతమైనదని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ నైస్ గార్డెన్ లో రాష్ట్ర ప్రభుత్వం తరపున ముస్లిం సోదరులకు" రంజాన్ తోఫా" పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తుందని సర్వ మానవ శ్రేయస్సుయే రంజాన్ పర్వదిన సందేశమని రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదరులకు రంజాన్ కానుక గా తోఫా కార్యక్రమం నిర్వహించడం ముదాబావమన్నారు. రంజాన్ పర్వదినం శాంతి సోదర భావానికి సేవాభావానికి ప్రతీక అని ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉండి సంక్షేమంలో భారతదేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ముందు వరుసలో నిలబడడం సంతోషమన్నారు. అనంతరం ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ కానుకలు అందించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, సీనియర్ నాయకులు కల్లెపల్లి సదానంద్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, వేణు, సతీష్ గౌడ్, మహమ్మద్ ఫారూఖ్, పాషా మియా, కాలేశా, యూసుఫ్



## పేద ముస్లిం మహిళలకు చీరలు పంచిన కందికంటి శంకరయ్య గౌడ్ ఫౌండేషన్

ఎల్బీనగర్, మార్చి 16 (భారత శక్తి): రంజాన్ పండుగ సందర్బంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కందికంటి శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయన తండ్రి కందికంటి శంకరయ్య గౌడ్ ఫౌండేషన్ తరపున సరూర్ నగర్ లోని గౌడ సంఘం భవనంలో పేద ముస్లిం అడపడుచులకు రంజాన్ తోఫా చీరలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్ రెడ్డి,ముద్దగౌని లక్ష్మి ప్రసన్న పాల్గొని 300 మందికి తోఫాలు పంచారు.ఈ కార్యక్రమంలో వేణు యాదవ్, అక్రమ్, ఎండీ షౌకుద్దీన్, ఖాజా, ఇంతియాజ్ ఖాజి, ఎండీ గౌస్, షేక్ నూర్జా, కిషోర్ గౌడ్, ఎండీ జాఫర్, ఎండీ సర్వర్ పాల్గోన్నారు.

## రైతు భరోసా నిధుల.... విడుదలలో జాప్యం వద్దు

* **చేనుకు చేవ రైతుకు రొక్కం... రైతు భరోసా నిధులు**
* **టిఆర్పిఎస్ ఆధ్వర్యంలో... 15వ విడత అన్నదాన కార్యక్రమం**





జవహర్ నగర్ మార్చి 16 (భారత్ శక్తి): చేనుకు చేవ రైతుకు రొక్కం రైతు భరోసా నిధులేనని టిఆర్పిఎస్ అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఈనెల 22న రైతు భరోసా నిధులు విడుదల చేయాలని, గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రి రైతు భరోసా నిధుల విడుదల విషయంలో మాట తప్పారని, ఈసారి మాట తప్పక రైతు భరోసా నిధులను విడుదల చేయాలని ఆమె కోరారు. తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం 15వ విడత రైతు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ డిసెంబర్ మాసంలో విడుదల కావలసిన రైతు భరోసా నిధులు మార్చి నెల వచ్చినా విడుదల కాకపోవడంతో సాగుకు పెట్టుబడి కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ అప్పల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రి రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని మూడుసార్లు మాట ఇచ్చారని కానీ రైతు భరోసా నిధులు విడుదల కాలేదని తెలిపారు. వచ్చే బడ్జెట్లో రైతు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున కేటాయించాలని భవాని కోరారు. అనంతరం తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి ఇంద్రపాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి అనేకమంది బాధితులు తమ సమస్యల పరిష్కారంకోసం వస్తుంటారని అటువంటి వారి కోసం ఎంతోకొంత సహకారం అందించాలని ఉద్దేశంతో ప్రతి సోమవారం తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం సుమారు 100 మందికి అన్నదానం అందిస్తున్నామని దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే మరి కొంతమందికి అన్నదానం అందిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో దావత్ అరుణ్, అంబాల విష్ణు, మల్లేష్, రైతులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అష్టలక్ష్మి దేవాలయం నూతన కమిటీ ఎన్నిక

ఎల్బీనగర్, మార్చి 16 (భారత శక్తి):: ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయం నూతన పాలకవర్గానికి ఆదివారం ఎన్నికలు జరిగాయి. దేవాలయం చైర్మన్ గా నాగమల్ల శ్రవణ్ కుమార్, వైస్ చైర్మెన్ వనం యాదయ్య, ప్రధాన కార్యదర్శి మైథం సుధాకర్ గుప్తా, కోశాధికారి దాచేపల్లి శ్రీనివాస్, కార్యదర్శులు శ్రీనివాసు గోవిందు, కొక్కొండ చంద్రశేఖర్, బికుమళ్ళ పవన్ కుమార్ లు ఎన్నికైనారు. ఎలక్షన్ అధికారులుగా గౌరిశెట్టి చంద్రశేఖర్, భరద్వాజ్, ఉప్పల నాగేశ్వర్ రావు, పబ్బా శ్రీనివాసులు వ్యవహారించారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి


* **మేడ్చల్ మల్కాజ్గిరి భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి**




మేడ్చల్ జిల్లా/మార్చి 16, (భారత్ శక్తి) : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల (125) దరఖాస్తులను డిప్యూటీ కలెక్టర్ మాలతితో కలిసి జిల్లా అధికారుల స్వీకరించారు.ఎంతో వ్యయ,ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి సుజాత, ఎఫ్ & జి సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్, ప్రాజెక్టు డైరెక్టర్ హౌసింగ్ రమణమూర్తి, డిఆర్డిఏ సాంబ శివ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు,



## మాజీ మంత్రి చామకురా మల్లారెడ్డి 50 వివాహ వార్షికోత్సవం సందర్భంగా మహిళాలకు చీరల పంపిణి



మేడ్చల్ జిల్లా, మార్చి 16 (భారత్ శక్తి) : మేడ్చల్ నియోజకవర్గం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చెరుకు బాలయ్య గార్డెన్ లో మాజి మంత్రి చామకురా మల్లారెడ్డి 50,వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా జరిగిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు ఏమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, ఏమ్మెల్యే కౌశిక్ రెడ్డి తో కలిసి పాల్గొనడం జరిగింది. పోచారం మాజీ కౌన్సిలర్ బద్దం మమత జగన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమనికి వచ్చిన మహిళాలకు చీరల పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువనాయకులు డా "భద్ర రెడ్డి, డా "ప్రీతి రెడ్డి, మాజీ మేయర్లు జక్కా వెంకట్ రెడ్డి, బుచ్చి రెడ్డి,మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవ రెడ్డి, రమేష్, శ్రీనివాస్ గౌడ్, సురేందర్ రెడ్డి, నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, మహిళాలు పాల్గొన్నారు.

## ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా చేస్తున్న యుద్ధం తక్షణమే ఆపాలి

* **సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు**
* **తోటపల్లి శంకర్**




జవహర్ నగర్ 16 (భారత్ శక్తి) : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమం కాప్రా మండల సిపిఐ కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా తోటపల్లి శంకర్ మాట్లాడుతూ యుద్ధము వలన గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి గ్యాస్ సిలిండర్ దొరకడం లేదు యుద్ధం వల్ల పేద ప్రజలు వాడుతున్న నిత్యవసర వస్తువులు మీద విపరీతంగా ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి అని ఇప్పటికే గ్యాస్ ధర పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు గ్యాస్ సిలిండర్ దొరకక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు ప్రజల అవసరా లు దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం పెరిగే ధరలను అదుపు చేయాలని యుద్ధాన్ని వెంటనే ఆపేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు సిపిఐ సీనియర్ నాయకులు సిహెచ్ దశరథ్ సిపిఐ అల్వాల్ మండల కార్యదర్శి అమరావతి బాబు రైతు సంగం జిల్లా అధ్యక్షులు డి జంగయ్య గిరిజన సమైక్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామలలత వి స్వరూప నాయక్ ప్రజా కళాకారుడు వి.వెంకట చారి సిపిఐ నాయకులు పి నరసింహ వి చిరంజీవి ఎన్ పద్మ ఎన్ సంతోష డి మల్లిక కోమల గణేష్ తదితరులు పాల్గొన్నారు

## గ్యాస్ గోడౌన్లను తనిఖీ చేసిన సివిల్ సప్లయ్ అధికారి



మణుగూరు, మార్చి 16 (భారతశక్తి): మండలంలోని గ్యాస్ ఏజెన్సీలను, సింగరేణి గ్యాస్ గోడౌన్ లను సివిల్ సప్లయ్ అధికారి శివ కుమార్, హెచ్పీసీఎల్ సేల్స్ మేనేజర్ పవన్ కుమార్ లు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. గ్యాస్ ఏజెన్సీలల్లో స్టాక్ రిజిస్టర్లు, ఆన్ లైన్ బుకింగ్ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బుకింగ్ చేసుకున్న కస్టమర్లకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా సకాలంలో గ్యాస్ సరఫరా చేయాలని సూచించారు. గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్ కు తరలించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. బ్లాక్ మార్కెట్ కు తరలిస్తే ఏజెన్సీ నిర్వహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సభకు ప్రిపేర్డై రండి.. మంత్రులకు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ క్లాస్

హైదరాబాద్, మార్చి 16 (భారత్ శక్తి) : తెలంగాణ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ప్రిపేర్డై రావాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి క్లాస్ పీకారు. మండలి కమిటీ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సీఎల్పీ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలపై గరమైనట్లు సమాచారం. అనవసర విషయాలు మాట్లాడొద్దు.. చిట్ చాట్‌లు మానేయాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు సమన్వయం చేసుకోవాలి. అంతేకాకుండా ఎమ్మెల్యేల సమస్యల విషయంలో వారికి మంత్రులు సమయం ఇవ్వాలి. నేను కూడా ఎమ్మెల్యేలకు సమయం ఇస్తాను. సభలో ఇష్యూపై కౌంటర్ ఇవ్వాలని సీఎం సూచించినట్లు సమాచారం.

**ప్రతి ఒక్కరూ సభకు రావాల్సిందే..**

బడ్జెట్ సమావేశాలు ముగిసే దాకా ప్రతి ఎమ్మెల్యే సభకు రావాల్సిందే. అటెండెన్స్ తప్పనిసరి. సీఎల్పీ మీటింగ్‌కు ఆరుగురు సభ్యులు రాలేదు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా..? ఆరోగ్య సమస్యలు ఉంటే సరే అని సీఎం అన్నట్లు సమాచారం. గవర్నర్ ప్రసంగం మన ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ ప్రజా ప్రభుత్వంలో మూడవ బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం. ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించి గవర్నర్ ప్రసంగంలో వివరించారు. గవర్నర్ ప్రసంగం మన ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిది. ఇక గత ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయింది. మన భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే దానిపై దృష్టిసారించాలి. సభలో మాట్లాడే అంశాలపై విప్‌ల మధ్య సమన్వయం ఉండాలి. సభలో చర్చ పక్కదారి పట్టకుండా, సభా సమయం వృధా కాకుండా సమర్థవంతంగా నడిపేలా చూడాలని సీఎం అన్నారు.

*** భట్టి విక్రమార్కకు, జానారెడ్డికి కూడా మైక్ ఇవ్వలేదు..**

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాకు సబ్జెక్ట్ మాట్లాడటానికి కూడా సమయం ఇవ్వలేదు. సీఎల్పీ నేతగా ఉన్న భట్టి విక్రమార్కకు, జానారెడ్డికి కూడా మైక్ ఇవ్వలేదు. సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నన్ను సభకు రాకుండా చేశారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించొద్దు. మహిళా శాసన సభ్యులు హాజరుతో పాటు చర్చల్లో పాల్గొనాలి. సభా చర్చల్లో మహిళా సభ్యుల భాగస్వామ్యం అవసరం. అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాలు పర్యటించి సమస్యలు, ఆయా ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలని సీఎం సూచించారు.

*** పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలి..**

రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజీ ఉండదు.. ఆది వ్యవస్థ మొత్తాన్ని డ్యామేజ్ చేస్తుంది. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుంది. పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలి. ఇది మన ప్రభుత్వం.. ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికలకు ఎజెండా అవుతుంది. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై ఫోకస్ పెట్టండి. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందే అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో వర్షం.. ఒక్కసారిగా మారిపోయిన వాతావరణం

హైదరాబాద్, మార్చి 16 (భారత్ శక్తి) :హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. సోమవారం సాయంత్రం భాగ్యనగరంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మాదాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. నగరంలో పలుచోట్ల రోడ్లపై నీరు మోకాళ్ల లోతుకు వచ్చింది. నగరంలో పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వరద నీటిని తొలగించేందుకు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగాయి.

## భారత్‌కు భారీ ఊరట.. క్షేమంగా ముంద్రా పోర్టుకు చేరుకున్న ఎల్పీజీ ట్యాంకర్ ‘శివాలిక్’

మార్చి 16 (భారత్ శక్తి) పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, భారత్‌కు ఇంధన సరఫరా విషయంలో భారీ ఊరట లభించింది. ఖతార్ నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ)తో బయలుదేరిన ‘శివాలిక్’ అనే భారత నౌక, అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని దాటి సోమవారం సాయంత్రం 5 గంటలకు గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. ఈ నౌకలో సుమారు 45,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన ‘శివాలిక్’, ‘నందా దేవి’ అనే రెండు నౌకలు కలిపి మొత్తం 92,700 మెట్రిక్ టన్నుల ఎల్పీజీని భారత్‌కు తీసుకువస్తున్నాయి. శివాలిక్ ఇప్పటికే తీరానికి చేరుకోగా, ‘నందా దేవి’ అనే మరో ట్యాంకర్ రేపు ఉదయం గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు రానుంది. ఈ విషయాన్ని కేంద్ర నౌకాశ్రయాలు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కుమార్ సిన్హా ధ్రువీకరించారు. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న భారత నావికులందరూ సురక్షితంగా ఉన్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని సిన్హా స్పష్టం చేశారు. ప్రస్తుతం హార్ముజ్ జలసంధికి పశ్చిమాన 22 భారత నౌకలు ఉన్నాయని, వాటిలో 611 మంది సిబ్బంది ఉన్నారని తెలిపారు. వీటితో పాటు, యూఏఈ నుంచి సుమారు 81,000 టన్నుల ముడిచమురుతో వస్తున్న ‘జగ్ లాడ్కీ’ నౌక కూడా ముంద్రా పోర్టుకు వస్తోందని, ఆ నౌకలోని సిబ్బంది కూడా క్షేమంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ప్రపంచంలోని చమురు, గ్యాస్ ఎగుమతుల్లో దాదాపు 20 శాతం హార్ముజ్ జలసంధి గుండానే జరుగుతాయి. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతల నేపథ్యంలో, అధికారులు నౌకల కదలికలను నిశితంగా గమనిస్తూ, షిప్పింగ్ లైన్లకు అవసరమైన మద్దతును అందిస్తున్నారు.

## నటి ప్రత్యూష మృతి కేసు: అమెరికా నుంచి వచ్చి కోర్టులో లొంగిపోయిన సిద్ధార్థ రెడ్డి

హైదరాబాద్, మార్చి 16 (భారత్ శక్తి) :సంచలనం సృష్టించిన సినీ నటి ప్రత్యూష మృతి కేసులో 24 ఏళ్ల తర్వాత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలిన సిద్ధార్థ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో లొంగిపోయాడు. సుప్రీం కోర్టు విధించిన నాలుగు వారాల గడువు ముగియడంతో, అమెరికా నుంచి నగరానికి వచ్చిన అతడు న్యాయస్థానం ముందు హాజరయ్యాడు. 2002 ఫిబ్రవరి 23న నటి ప్రత్యూష, ఆమె స్నేహితుడు సిద్ధార్థ రెడ్డి ఓ కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగారు. ఈ ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురైన ఇద్దరినీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రత్యూష మృతి చెందింది. సిద్ధార్థ రెడ్డి మాత్రం ప్రాణాలతో బయటపడ్డాడు. తన కుమార్తెది హత్యేనని ప్రత్యూష తల్లి ఆరోపిస్తూ దశాబ్దాలుగా న్యాయపోరాటం చేశారు. విచారణ జరిపిన ట్రయల్ కోర్టు, ప్రత్యూషను ఆత్మహత్యకు ప్రేరేపించాడన్న ఆరోపణలపై సిద్ధార్థ రెడ్డిని దోషిగా నిర్ధారించి ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ట్రయల్ కోర్టు తీర్పును సిద్ధార్థ రెడ్డి హైకోర్టులో సవాల్ చేశాడు. అయితే, ఐదేళ్ల శిక్షను హైకోర్టు రెండేళ్లకు తగ్గించింది. అయినప్పటికీ సిద్ధార్థ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. సిద్ధార్థరెడ్డి పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేస్తూ, నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే అతడు కోర్టులో లొంగిపోవాల్సి వచ్చింది. పోలీసులు అతడిని చంచల్ గూడ జైలుకు తరలించారు.

## ముస్లింల అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం

అమరావతి, మార్చి 16 (భారత్ శక్తి) విజయవాడలో సోమవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులందరికీ ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి పథంలో నడిపించడమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. పేదలకు సాయం చేయడమే ఖురాన్ ప్రవచించిన గొప్ప సూక్తి అని, మహ్మద్ ప్రవక్త బోధనలను స్ఫూర్తిగా తీసుకుని పనిచేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 21 నెలల కాలంలో మైనారిటీల సంక్షేమానికి అనేక పథకాలు అందించామని చంద్రబాబు వివరించారు. ఎన్టీఆర్ భరోసా కింద 4.38 లక్షల మంది ముస్లింలకు ఏటా రూ.3,511 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా, 4.5 లక్షల మంది విద్యార్థులకు ‘తల్లికి వందనం’ అందిస్తున్నామని, 19,215 మందికి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పుల కింద రూ.240 కోట్లు, దీపం పథకం ద్వారా 6.20 లక్షల కుటుంబాలకు రూ.158 కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. 33,275 మందికి ఆర్థిక చేయూత కింద రూ.193 కోట్లు అందించామని చెప్పారు. ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనాన్ని రూ.5 వేలు, రూ.10 వేలకు పెంచి రూ.180 కోట్లు అందించామని, బకాయిలుగా ఉన్న రూ.45 కోట్లను కూడా విడుదల చేస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అర్హులైన ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమించనున్నామని, వివాహ లైసెన్స్ గడువును 3 ఏళ్ల నుంచి 10 ఏళ్లకు పెంచుతున్నామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచే 347 మంది హజ్ యాత్రకు వెళ్లేలా ఏర్పాట్లు పూర్తిచేశామని గుర్తుచేశారు. గత పాలకులు జీవో 47 ద్వారా వక్ఫ్ బోర్డును వివాదాల్లోకి నెట్టారని చంద్రబాబు విమర్శించారు. తమ ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేసి, బోర్డుకు ఎన్నికలు నిర్వహించిందని, సుమారు 1500 వక్ఫ్ ఆస్తులపై సర్వే పూర్తి చేశామని తెలిపారు. వక్ఫ్ ఆస్తులను కాపాడి, వాటి ఫలాలను ముస్లింల సంక్షేమానికే వినియోగిస్తామని భరోసా ఇచ్చారు. నూర్ బాషా ఫెడరేషన్‌ను దూదేకుల ముస్లిం ఫైనాన్స్ కార్పొరేషన్‌గా మార్చి రూ.100 కోట్లు కేటాయించామన్నారు. మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరిస్తూ, గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.5,434 కోట్ల నుంచి ఈసారి రూ.6,090 కోట్లకు పెంచామని వెల్లడించారు. గత ప్రభుత్వం ఉర్దూ అకాడమీకి కేవలం రూ.1 లక్ష ఇస్తే, తాము రూ.7 కోట్లు మంజూరు చేశామన్నారు. ఉర్దూను రెండో అధికార భాషగా గుర్తించామని, కడప, విజయవాడ నగరాల్లో హజ్ హౌస్‌ల నిర్మాణం త్వరలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

## మోదీ పర్యటనకు, ఇరాన్‌పై దాడికి సంబంధం లేదు

మార్చి 16 :పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో భారత ప్రధాని మోదీ పర్యటనపై వస్తున్న విమర్శలకు భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజార్ స్పష్టతనిచ్చారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనకు, ఆ వెంటనే ఇరాన్‌పై జరిగిన దాడులకు ఎలాంటి సంబంధం లేదని ఆయన తేల్చి చెప్పారు. ప్రధాని మోదీ ఫిబ్రవరి 2526 తేదీల్లో ఇజ్రాయెల్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత రెండు రోజుల తర్వాత (ఫిబ్రవరి 28న) ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు ప్రారంభించాయి. ఈ క్రమాన్ని ఉటంకిస్తూ, పశ్చిమాసియా ఉద్రిక్తతలకు భారత్ మద్దతు ఇస్తోందన్నట్లుగా విపక్షాలు చేస్తున్న విమర్శలను ఇజ్రాయెల్ రాయబారి తోసిపుచ్చారు. ఆ ప్రాంతంలో పరిస్థితులు మోదీ పర్యటనకు ముందు నుంచే అస్థిరంగా ఉన్నాయని, ఆపరేషన్ చేపట్టేందుకు తమకు అవకాశం వచ్చినప్పుడే దాడులు చేశామని ఆయన వివరించారు. మోదీ ఇజ్రాయెల్ పర్యటన పూర్తిగా రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఉద్దేశించినదని, దీనిని సైనిక చర్యలతో ముడిపెట్టడం సరికాదని ఆయన స్పష్టం చేశారు.

## ఆస్కార్2026 అవార్డు విజేతల పూర్తి జాబితా

మార్చి 16 (భారత్ శక్తి) :పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా వేలాది విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. సోమవారం నాడు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన లోక్‌సభలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ సంక్షోభం వల్ల భారత విమానయాన సంస్థలు 4,335 విమానాలను, విదేశీ సంస్థలు 1,187 విమానాలను రద్దు చేశాయని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రతకే ప్రభుత్వం, విమానయాన సంస్థలు అత్యంత ప్రాధాన్యత ఇస్తాయన్నారు. “సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో గగనతలాన్ని మూసివేసినప్పుడు అక్కడ విమానాలు నడపాల్సిన అవసరం లేదు” అని ఆయన స్పష్టం చేశారు. అయితే, విమానాల రద్దుతో అంతరాయం ఏర్పడినప్పటికీ, ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య కూడా దాదాపు 2,19,780 మంది ప్రయాణికులు ప్రయాణించినట్లు మంత్రి తెలిపారు. భారత విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ), పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు ప్రభావిత ప్రాంతాల అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని వివరించారు. ఆయా ప్రాంతాల్లో గగనతలం తిరిగి తెరుచుకున్న తర్వాతే విమాన సర్వీసులు సాధారణ స్థితికి వస్తాయని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

## యువగళంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

అమరావతి, మార్చి 16 (భారత్ శక్తి) అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేస్తానని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రజారాజధాని అమరావతిలో తన హామీకి ప్రతిరూపంగా నిలిచిన ‘స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్’ ఆవిష్కరణ తనకెంతో ఆనందాన్నిచ్చిందని ఆయన పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన సాగించిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు ప్రతీకగా 58 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని అమరావతిలోని శాఖమూరులో ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జరిగిన ఈ విగ్రహావిష్కరణ మహోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరజీవి త్యాగశిల్పం వద్ద ఆయన పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, “ఒక మనిషి త్యాగం ఒక జాతికి గౌరవంగా నిలిచింది. ఒక దీక్ష ఒక రాష్ట్రాన్ని ఇచ్చింది. పొట్టి శ్రీరాములు గారు మరణం లేని మహనీయుడు, త్యాగానికి మానవరూపం. ఆయన 125వ జయంతి రోజున 58 అడుగుల విగ్రహం రూపంలో మనకోసం మళ్లీ జన్మించారు. ఈ విగ్రహానికి ఏం పేరు పెట్టాలని దూండి రాకేష్ అడిగినప్పుడు, ఆయన త్యాగం గుర్తుకురావాలనే ఉద్దేశంతో ‘స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్’ అని సూచించాను. ఈ విగ్రహం తెలుగుజాతి గొప్పతనాన్ని అమరావతి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళుతుంది” అని వివరించారు.

**యువగళం హామీని నిలబెట్టుకున్నా**

తాను తెలుగువాడినని, ఆంధ్రప్రదేశ్ పౌరుడినని గర్వంగా చెప్పుకుంటున్నానని, ఆ గౌరవాన్ని మనందరికీ ఇచ్చింది పొట్టి శ్రీరాములు అని లోకేశ్ అన్నారు. “యువగళం పాదయాత్రలో ఆర్యవైశ్య సోదరులను అనేకసార్లు కలిసి వారి సమస్యలు చర్చించాను. వారికిచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే అమరావతిలో అమరజీవి విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చాను. ఇచ్చిన హామీని ఇంత తక్కువ సమయంలో నిలబెట్టుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ విగ్రహంలోని 58 అడుగులు, ఆయన చేసిన 58 రోజుల దీక్షకు సంకేతం. మనం ఒక్కరోజు ఉపవాసం ఉండటానికే ఇబ్బంది పడతాం. అలాంటిది ఒక రాష్ట్రం కోసం ఆయన 58 రోజులు దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారు. ఈ చరిత్రను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత” అని లోకేశ్ ఉద్ఘాటించారు. కేవలం 194 రోజుల్లోనే విగ్రహ ఏర్పాటు పూర్తి చేసిన కూటమి ప్రభుత్వాన్ని, ట్రస్ట్ సభ్యులను, అధికారులను ఆయన అభినందించారు.

**నిత్య పోరాటయోధుడు పొట్టి శ్రీరాములు**

పొట్టి శ్రీరాములు జీవితాన్ని స్మరించుకుంటూ, ఆయన నిత్య పోరాటయోధుడని లోకేశ్ కొనియాడారు. “ఆయన స్వార్థం లేని ఉద్యమాలు చేశారు. గాంధీజీతో కలిసి సబర్మతి ఆశ్రమంలో పనిచేశారు. స్వాతంత్ర్య పోరాటంలో జైలుకు వెళ్లారు. నెల్లూరులో దళితుల ఆలయ ప్రవేశం కోసం, అంటరానితనంపై పోరాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడకపోవడం మహాపాపం అని ప్రకటించి, ‘వస్తే రాష్ట్రం, పోతే ప్రాణం’ అని నిశ్చయించుకున్నారు. దీక్షకు ఎవరూ స్థలం ఇవ్వకపోతే రోడ్డు మీదే చేస్తానన్న ఆయన స్ఫూర్తి నా యువగళం పాదయాత్రకు ప్రేరణగా నిలిచింది” అని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. 1952 అక్టోబర్ 19న మద్రాసులో బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించినప్పుడు 53.9 కిలోల బరువున్న పొట్టి శ్రీరాములు, 58వ రోజుకు 38.1 కిలోలకు పడిపోయారని, అయినా వెనకడుగు వేయకుండా ప్రాణత్యాగంతో ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారని లోకేశ్ వివరించారు. ఆయన ప్రాణత్యాగం కోట్ల మందిని కదిలించి, ఢిల్లీని దిగివచ్చేలా చేసిందని, ఫలితంగా 1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు.

*** భారతదేశ చిత్రపటాన్ని మార్చిన మహనీయుడు**

ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ వ్యాసాన్ని ఉటంకిస్తూ, “పొట్టి శ్రీరాములు గారి దీక్ష తర్వాతే భారతదేశ చిత్రపటంపై భాషా ప్రయుక్త రాష్ట్రాల రేఖలు ఏర్పడ్డాయని గుహ అన్నారు. అందుకే ఆయనను ‘భారతదేశ మెర్కాటర్’గా అభివర్ణించారు. 16వ శతాబ్దంలో ప్రపంచ పటాన్ని రూపొందించిన భౌగోళిక శాస్త్రవేత్త మెర్కాటర్. అంతటి గొప్ప వ్యక్తి చరిత్రను దేశం గుర్తుంచుకునేలా ఈ విగ్రహం దోహదపడుతుంది” అని లోకేష్ అన్నారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి రోశయ్యను స్మరించుకున్న లోకేశ్, ఆయన రాజకీయాలకు అతీతంగా పనిచేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్ కోరిక మేరకు పొట్టి శ్రీరాములు పేరు మీద స్మారక నాణెం విడుదల కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని లోకేష్ వెల్లడించారు. రాబోయే 12 నెలల్లో స్మృతివనం, ఫొటో గ్యాలరీ, మ్యూజియం, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్. సవిత, టీజీ భరత్, పి. నారాయణ, కందుల దుర్గేశ్, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు, అధికారులు, పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## పశ్చిమ ఆసియా టెన్షన్: వేలాది విమానాలు రద్దు..

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా వేలాది విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. సోమవారం నాడు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన లోక్‌సభలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ సంక్షోభం వల్ల భారత విమానయాన సంస్థలు 4,335 విమానాలను, విదేశీ సంస్థలు 1,187 విమానాలను రద్దు చేశాయని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రతకే ప్రభుత్వం, విమానయాన సంస్థలు అత్యంత ప్రాధాన్యత ఇస్తాయన్నారు. “సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో గగనతలాన్ని మూసివేసినప్పుడు అక్కడ విమానాలు నడపాల్సిన అవసరం లేదు” అని ఆయన స్పష్టం చేశారు.

# ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ: ఓటీఎస్ సద్వినియోగం చేసుకోండి

* మార్చి 31 వరకు గడువు.. 'మై క్యూర్' యాప్‌లోనూ చెల్లింపు సౌకర్యం
* జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ వెల్లడి..

హైదరాబాద్, మార్చి 16 (భారత శక్తి) : నగరంలో ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వారు ప్రభుత్వం కల్పించిన 'వన్ టైమ్ సెటిల్మెంట్' (ఓటీఎస్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జిహెచ్ఎంసి) కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పిలుపునిచ్చారు. పాత బకాయిలపై పేరుకుపోయిన వడ్డీలో 90 శాతం రాయితీ ఇస్తున్నామని, ఈ అవకాశం మార్చి 31 వరకే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అదనపు కమిషనర్లు ప్రియాంక అల, రవికిరణ్, పీఆర్ఓ మామిండ్ల దశరథంతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు.

**పెరిగిన పన్ను వసూళ్లు:**

కమిషనర్ తెలిపిన వివరాల ప్రకారం.. క్యూర్ (CURE) పరిధిలోని 28.08 లక్షల మంది ఆస్తి పన్నుదారుల్లో ఇప్పటివరకు 16.80 లక్షల మంది పన్ను చెల్లించారు. గతేడాది ఇదే సమయానికి రూ.1,984 కోట్ల ఆదాయం రాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.2,186 కోట్లు వసూలైందని ఆయన వివరించారు. పన్ను చెల్లింపుల్లో పారదర్శకత కోసం ఆన్‌లైన్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని.. మీ సేవ కేంద్రాలు, వెబ్‌సైట్, సిటిజన్ సర్వీస్ సెంటర్లు లేదా 'మై క్యూర్' (My CURE) యాప్ ద్వారా చెల్లించవచ్చని సూచించారు. దీర్ఘకాలికంగా పన్ను ఎగవేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



**99 రోజుల ప్రగతి ప్రణాళిక:**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా గత పది రోజులుగా (మార్చి 6 నుండి 16 వరకు) నగరవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. పారిశుద్ధ్యం: గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల (GVP) తొలగింపు, రహదారుల క్లీనింగ్, ప్రజారోగ్య కేంద్రాల నిర్వహణ. మౌలిక సదుపాయాలు: ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, పాదచారుల వంతెనల (FOB) వద్ద పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు. పర్యావరణం: మెగా ఈవేస్ట్ డ్రైవ్ ద్వారా ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ, నిర్మాణ వ్యర్థాల (C&D Waste) తొలగింపు.

**ముమ్మరంగా ఓటీఎస్ ప్రచారం:**

ఓటీఎస్ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని కర్ణన్ తెలిపారు. 100 బస్ షెల్టర్లలో పోస్టర్లు, కేబుల్ టీవీ, ఎఫ్.ఎం. రేడియో, సోషల్ మీడియా వేదికగా ప్రకటనలు ఇస్తున్నట్లు చెప్పారు. సినిమా థియేటర్లలో ప్రదర్శించేందుకు ప్రత్యేక వీడియోలను సిద్ధం చేశామని, వీటికి సెన్సార్ బోర్డు (CBFC) అనుమతి కూడా లభించిందని, మంగళవారం నుంచి ఇవి ప్రదర్శితమవుతాయని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ను పరిశుభ్రమైన, సుపరిపాలన కలిగిన నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# గవర్నర్ ప్రసంగం అంతా 'గాలిలో మేడలే'

* తెలంగాణ తల్లి విగ్రహం నుంచి బతుకమ్మ తొలగింపు సాంస్కృతిక ద్రోహం..
* ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన తెలంగాణ జాగృతి నేత పాండురంగారెడ్డి.



హైదరాబాద్, మార్చి 16 (భారత శక్తి) : రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్ల చేసిన ప్రసంగం వాస్తవ దూరంగా, కేవలం అంకెల గారడీగా ఉందని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి విమర్శించారు. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**అస్తిత్వాన్ని దెబ్బతీసే కుట్ర:**

అసెంబ్లీ ప్రాంగణంలో ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహం నుంచి బతుకమ్మను తొలగించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బతుకమ్మ లేని తెలంగాణ తల్లి.. ఆత్మ లేని దేహం వంటిదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను, సంస్కృతిని చెరిపేసేందుకు రేవంత్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఉద్యమంతో సంబంధం లేని వారే చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తారని విమర్శించారు.

ప్రసంగంలోని డొల్లతనం క్షేత్రస్థాయి వాస్తవాలు:

* 2047 లక్ష్యం.. నేటి సంక్షోభం: 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అని కలలు చూపిస్తున్న ప్రభుత్వం, ప్రస్తుతం అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని ఎలా గట్టెక్కిస్తుందో చెప్పడం లేదని విమర్శించారు. భవిష్యత్తు ఊహల కోసం నేటి నిరుద్యోగతను, ఆర్థిక ఇబ్బందులను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. జీహెచ్ఎంసీ విభజనపై అభ్యంతరం: హైదరాబాద్ నగరాన్ని మూడు ముక్కలు చేయడం వెనుక కేవలం రాజకీయ స్వార్థమే ఉందన్నారు. దీనివల్ల సామాన్యులకు వచ్చే లాభం ఏమీ లేదని, కేవలం అధికారుల సంఖ్య, నిర్వహణ ఖర్చు పెరుగుతుందని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన పేదల వెలివేత: మూసీ పునరుద్ధరణ పేరుతో వేల కోట్ల ప్రాజెక్టులు చేపడుతూ, అక్కడ దశాబ్దాలుగా నివసిస్తున్న పేదలను నిరాశ్రయులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అభివృద్ధి పేరుతో జరుగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారమని ఆరోపించారు. రైతు భరోసాలో అన్యాయం: రైతు భరోసా నిధుల పంపిణీలో ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, కానీ క్షేత్రస్థాయిలో కౌలు రైతులు, సామాన్య రైతులకు నేటికీ సాయం అందడం లేదని విమర్శించారు. 'రేర్' నమూనా పేరుతో వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని హెచ్చరించారు.
* ప్రజాపాలన పర్యవసానం: 'ప్రజాపాలన' కేవలం దరఖాస్తుల స్వీకరణకే పరిమితమైందని, పరిష్కారం నోచుకోని 47 వేల పిటిషన్లే ఇందుకు సాక్ష్యమని పాండురంగారెడ్డి ఎద్దేవా చేశారు.
* ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, ప్రకటించిన బుల్లెట్ రైళ్లు, విమానాశ్రయాలు సామాన్యుడికి అందుబాటులో లేవని, ఇవన్నీ కేవలం ఎన్నికల తాయిలాలుగానే మిగిలిపోతాయని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ వైఫల్యాలను 'జాగృతి' నిరంతరం ఎండగడుతుందని స్పష్టం చేశారు

## గోషామహల్, కార్వాన్ సర్కిళ్లలో

# జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ తనిఖీ

హైదరాబాద్, మార్చి 16 (భారత శక్తి) : 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం ఉదయం గోషామహల్, కార్వాన్ సర్కిళ్లలో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. పారిశుద్ధ్యం, జంక్షన్ల అభివృద్ధి, రహదారుల నిర్వహణ పనులను స్వయంగా పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**పర్యటనలోని ముఖ్యాంశాలు:**

**జంక్షన్ల అభివృద్ధి:** భగత్ సింగ్ జంక్షన్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. రహదారులపై ఉన్న గుంతలకు తక్షణమే ప్యాచ్ వర్కులు పూర్తి చేసి, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ: పీపీపీ పద్ధతిలో నిర్వహిస్తున్న మరుగుదొడ్లను తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించి, నిర్వహణలో అలసత్వం వహించరాదని, నిత్యం శుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు.



ఆక్రమణల తొలగింపు: అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఉగాది నాటికి ఈ భవనాన్ని ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని సూచించారు.

**పారిశుద్ధ్య పరిశీలన:** కాలినడకన తిరుగుతూ గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు (జీవీపీ), జియాగూడ 100 ఫీట్ల రోడ్డులో పారిశుద్ధ్య పనులను సమీక్షించారు. చెత్త నిల్వలు లేకుండా చూడాలని రామ్‌కీ ప్రతినిధులు, శానిటేషన్ సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి, అడిషనల్ కమిషనర్ రవికిరణ్‌తో పాటు ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో 'మెరుపు' వేగంతో హంతకుల అరెస్ట్!

* 6 గంటల్లోనే కేసు ఛేదించిన పోలీసులు
* ఫోన్ ఎత్తలేదన్న కోపంతోనే స్నేహితుడి దారుణ హత్య



ఉప్పల్, మార్చి 16 (భారత శక్తి): నగరంలో సంచలనం సృష్టించిన చిలకానగర్ హత్య కేసును ఉప్పల్ పోలీసులు రికార్డు సమయంలో ఛేదించారు. హత్య జరిగిన కేవలం ఆరు గంటల వ్యవధిలోనే నిందితుల ఆచూకీ కనిపెట్టి, వారిని కటకటాల్లోకి నెట్టారు. మల్కాజిగిరి డీసీపీ సురేష్‌కుమార్ నేతృత్వంలోని బృందం 'సింగం' తరహాలో ఆపరేషన్ నిర్వహించి హంతకులను అదుపులోకి తీసుకుంది.

**అహం దెబ్బతిని.. ప్రాణం తీసి!**

పోలీసుల కథనం ప్రకారం.. బానోతు సంతోష్, పొడిశెట్టి తరుణ్, మృతుడు సుధీర్ కుమార్ ముగ్గురూ ప్రాణ స్నేహితులు. అయితే, మూడు రోజుల క్రితం జరిగిన సుధీర్ బావ గృహప్రవేశ వేడుక వీరి మధ్య చిచ్చు పెట్టింది. చిన్న గొడవ: ఫంక్షన్ సమయంలో సంతోష్ చేసిన ఫోన్ కాల్స్‌ను సుధీర్ ఎత్తకపోవడంతో గొడవ మొదలైంది. "పిలిచి అవమానిస్తావా?" అనే అహంకారం సంతోష్‌లో పగగా మారింది.

* పథకం ప్రకారం: ఆదివారం రాత్రి చర్చల పేరుతో సుధీర్‌ను చిలకానగర్ గ్రౌండ్‌కు పిలిపించారు. అక్కడ మాటామాటా పెరగడంతో, ముందే సిద్ధం చేసుకున్న కత్తులతో సుధీర్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు.
* వేటాడి.. వెంటాడి..: ప్రాణభయంతో సుధీర్ రోడ్డుపైకి పరుగులు తీసినా, వదలకుండా వెంటాడి వేటాడి కత్తులతో పొడిచి కిరాతకంగా చంపేశారు.

**పోలీసుల 'మెరుపు' ఆపరేషన్:**

* రాత్రి 10:30 గంటలకు సమాచారం అందగానే పోలీసులు రంగంలోకి దిగారు. డీసీపీ సురేష్ కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పడ్డాయి.
* సాంకేతిక దర్యాప్తు: సీసీటీవీ ఫుటేజీలు, ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుల కదలికలను నిరంతరం ట్రాక్ చేశారు.
* అర్ధరాత్రి వేట: నిందితులు నగరం దాటి పారిపోయేలోపే, తెల్లవారుజామున 4 గంటలకు వారిని చుట్టుముట్టి అరెస్ట్ చేశారు.
* స్వాధీనం: హత్యకు వాడిన మారణాయుధాలు, నిందితులు పారిపోవడానికి ఉపయోగించిన హోండా యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

**శాంతిభద్రతలకు భరోసా:**

కేసును అత్యంత వేగంగా ఛేదించిన ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ వై. రామలింగారెడ్డి, ఎస్ఓటి ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు. నేరం జరిగిన వెంటనే స్పందించి నిందితులను పట్టుకోవడంతో స్థానిక ప్రజలు పోలీసులపై ప్రశంసలు కురిపిస్తున్నారు. "నేరం చేస్తే చట్టం నుంచి తప్పించుకోవడం అసాధ్యం" అని ఈ ఆపరేషన్ ద్వారా పోలీసులు మరోసారి నిరూపించారు.

## రంగానాయకుల గుట్టలో

# సీసీ రోడ్ల పనుల పరిశీలన


: **కళ్లెం నవజీవన్ రెడ్డి**




హయత్ నగర్, మార్చి 16 (భారత శక్తి) : హయత్ నగర్ డివిజన్‌లోని రంగానాయకుల గుట్ట కాలనీలో జరుగుతున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సోమవారం పరిశీలించారు. కాలనీలోని పలు వీధుల్లో కొనసాగుతున్న పనుల పురోగతిని పర్యవేక్షించిన ఆయన, నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీవాసులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న రహదారి సమస్యల పరిష్కారానికి ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో బురద, నిలిచిన నీటి కారణంగా స్థానికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కాలనీలో ఇతర మౌలిక వసతుల కల్పనకు కూడా దశలవారీగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, నాయకులు కుమార్, ఆకుల అరుణ్, ఎర్ర ప్రేమ్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బందికి...వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం

ఎల్బీనగర్, మార్చి 16 (భారత శక్తి): మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ లోని పోలీసు సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు ఫ్రీ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు.మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ లోని పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉండడానికి, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా గుర్తించి చికిత్స చేయించుకోవడానికి మల్కాజిగిరి సిపి అవినాష్‌మహంతి ఆదేశానుసారం ఒమేగా హాస్పిటల్, ఫోర్ట్ డెంటల్, డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్స్ వారిచే ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించారు. సోమవారం ఎల్బీనగర్ సిపి క్యాంపు ఆఫీస్ లో మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ హెల్త్ క్యాంపు నందు కింద పేర్కొన్న



పలు ఆరోగ్య పరీక్షలు చేయబడినాయి.లిపిడ్ ప్రొఫైల్ బీఎండీ (బోన్ మినరల్ డేన్సిటీ ఆర్బీఎస్, బీపీ, ఈసీజీ, 2డిఇకో, పిఎస్ఏ (ప్రోస్టేట్ స్పెసిఫిక్ ఆంటీజెన్) 45 ఏళ్ల వయస్సు పైబడిన పురుషులకు పిఏపి స్మెర్ (40 ఏళ్ళు పైబడిన మహిళలకు) మమ్మోగ్రామ్ (40 ఏళ్ళు పైబడిన మహిళలకు) ఈ హెల్త్ క్యాంపులో ఫోర్ట్ డెంటల్ వారిచే దంత సంబంధ పరీక్షలు, అగర్వాల్ ఐ హాస్పిటల్ వారిచే కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపులో ఎముకల,జనరల్ డాక్టర్లు పాల్గొన్నారు.మహిళ సిబ్బందికి ముందస్తుగా క్యాన్సర్ రాకుండా ఉండే చికిత్సలు చెకప్ లు నిర్వహించడం జరుగుతుంది. ఇది అందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

**ఈ క్యాంపు రేపు కూడా కొనసాగుతుంది**

ఈ కార్యక్రమంలో డిసిపి అడ్మిన్ ఇందిరా, యూనిట్ డాక్టర్లు సరిత, అచ్యుత రావు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రా రెడ్డి, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.